# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :36 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 27-03-2024 | పేజీలు:4 వెల: 2.00


## వయనాడ్ నుంచి బిజెపి చీఫ్ పోటీ..రాహుల్‌పై పోటీకి దిగిన సురేంద్రన్

న్యూఢిల్లీ,రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై .. ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ కే సురేంద్రన్ పోటీ పడనున్నారు. 2009 నుంచి వయనాడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తున్నది. 2019 జనరల్ ఎలక్షన్స్‌లో సురేంద్రన్ పత్థనంమిట్ట స్థానం నుంచి పోటీ చేశారు. 2016 ఎన్నికల్లో మంజేశ్వరం అసెంబ్లీ స్థానం నుంచి సురేంద్రన్ 89 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2019లో జరిగిన బైపోల్స్ లో పోటి చేసి ఓటమి చెందారు. 2020లో కేరళ బీజేపీ చీఫ్‌గా నియమితుడయ్యారు. శబరిమలలో మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ ఆయన ఆందోళనలు చేపట్టారు. కేరళలోని తిరువనంతపురం తర్వాత వయనాడ్ స్థానం కీలకంగా మారింది. తిరువనంతపురంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఎంపీ శశి థరూర్ మధ్య పోటీ జరగనున్నది.

# కాంగ్రెస్ తుది జాబితాపై కసరత్తు..!



న్యూఢిల్లీ,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీకి వెళ్లనున్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన.. తెలంగాణ కాంగ్రెస్ తుది జాబితాపై కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే 9 స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యింది. బుధవారం నాటి భేటీలో మరో ఎనిమిది స్థానాలపై తుది ప్రకటన వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైకమాండ్ ఇప్పటికే దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో మెజార్టీ స్థానాలను తెలంగాణ రాష్ట్రంలో గెలుచుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. పార్టీ నేతలకు, శ్రేణులకు టార్గెట్లు సైతం విధిస్తున్నారు. అధికార పార్టీ కావడంతో ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలకు సానుకూల ఫలితాలు లభిస్తున్నట్టే కనిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 9 స్థానాలకు ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేశారు. తొమ్మిది మంది కూడా ఖచ్చితంగా గెలుస్తారు అనే ధీమాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టికెట్లను ప్రకటించిన సందర్భంలోనే పేర్కొన్నారు.ఈ క్రమంలోనే తుది జాబితా కసరత్తు ఈనెల 27వ తేదీన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే రోజు ఢిల్లీలో జరగనున్న కేంద్ర స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి హాజరుకానున్నారు. తాను ప్రతిపాదించిన ఎనిమిది స్థానాల అభ్యర్థుల జాబితా కూడా మరోసారి రేవంత్ రెడ్డి ప్రతిపాదించే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క , జూపల్లి కృష్ణారావు లతో కూడా చర్చించారు.అందరి అభిప్రాయాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలువ ఇవ్వడం విశేషం. అభ్యర్థుల ఎంపికలో పూర్తి స్వేచ్ఛను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధిష్టాన వర్గం ఇప్పటికే ఇచ్చింది. అయినప్పటికీ అందరినీ కలువుకోవాలని దిశగా రేవంత్ రెడ్డి సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

ఆ దిశగానే సత్తా చాటాలని కూడా నిర్ణయానికి వచ్చారు.

మహబూబాబాద్ లో గెలుపు గుర్రం గా భావించి మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్ కు టికెట్ ను కేటాయించారు. పెద్దపల్లి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిని ప్రదర్శించారు. అక్కడ గడ్డం వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణకు టికెట్ కేటాయించడంలో చాణక్యరీతిని ప్రదర్శించారు. ఆర్థిక, అంగ బలం ఉన్న గడ్డం వంశీకృష్ణ అయితేనే అక్కడ సరైన అభ్యర్థి అని ఆయన భావించారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ లో సీనియర్ పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవికి కేటాయించడం జరిగింది. మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ వంశీ చందు రెడ్డికి టికెట్ ఖరారు అయింది. అదేవిధంగా భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి వచ్చిన రంజిత్ రెడ్డికి చేవెళ్ల టికెట్ కేటాయించారు. సునీత 'మహేందర్ రెడ్డి కి మల్కాజిగిరి సీటును, ఎమ్మెల్యే దానం నాగేందర్ కు సికింద్రాబాద్ స్థానాన్ని కేటాయించడం జరిగింది. అదేవిధంగా సీనియర్ నేత సురేష్ షెట్కార్‌కుః జహీరాబాద్ టికెట్ ను కేటాయించారు.ఈ పరిణామాల నేపథ్యంలో మరో ఎనిమిది సీట్లకు సంబంధించి తీవ్ర స్థాయిలోనే కసరత్తు కొనసాగుతున్నది. గట్టి అభ్యర్థులు లభించిన పక్షంలో ఇతర పార్టీల నుంచి అయినా ఆకర్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కసరత్తు ప్రారంభించారు...మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించి పూర్తి స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితులు ఇలా ఉండగానే లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయబోయే ఎంపీ అభ్యర్థుల మరో జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది. ఐదుగురు ఎంపీ అభ్యర్థులతో సోమవారం ఆరో జాబితాను రిలీజ్ చేసింది. ఆరవ లిస్టో రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఆరో జాబితాలో తెలంగాణకు సంబంధించి అభ్యర్థుల ప్రకటన జరగలేదు. ఇప్పటి వరకు మొత్తం ఆరు జాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్.. 190 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇక, తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలకు గానూ 9 సెగ్మెంట్లకు అభ్యర్థులను ఖరారు చేసింది. మరో 8 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.ఈ నెల 27 వ తేదీన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీలో తెలంగాణకు సంబంధించి పెండింగ్లో ఉన్న8 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# ఖాకీలు కాదు వాళ్లు.. ఖతర్నాక్ రౌడీలు.. తెరపైకి బీఆర్ఎస్ పెద్దల పేర్లు



హైదరాబాద్,వాళ్లు ఖాకీలు కాదు.. ఖతర్నాక్ రౌడీలు.. ప్రభుత్వ పెద్దలు చెప్పిందే వారికి వేదం. చట్టాన్ని చుట్టంగా మార్చుకొని.. ప్రజల కోసం కాకుండా.. అమాత్యుల కోసం పనిచేసి.. ఇప్పుడు కటకటాల్లోకి వెళ్లారు. అయితే ఖాకీ డ్రెస్‌ను అడ్డంగా పెట్టుకొని చేసిన దారుణాలు, దందాల గుట్టు రట్టైంది. విపక్ష నేతలనే కాదు.. ఇంకా చాలా అంశాలపై జరిగిందీ ఈ ట్యాపింగ్ దందా. అంతేకాదు కొందరు సూత్రధారుల పేర్లు కూడా బయటికి వచ్చాయి.ఇప్పటివరకు మనమనుకున్నదేంటి.. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు విపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారు. కానీ విషయం మరింత ఉంది. తవ్వుతున్న కొద్ది అన్ని షాకింగ్ విషయాలే. ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న కీ ప్లేయర్లు కాగా.. ఈ ట్యాపింగ్ టీమ్‌కు కెప్టెన్లుగా వ్యవహరించింది. SIB మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు.. వీరు నేతల ఫోన్లు మాత్రమే కాదు. రియల్ ఎస్టేట్ పెద్దలు.. వ్యాపారులు, హవాలా చేసేవారిని కూడా.. టార్గెట్ చేసింది ఈ ట్యాపింగ్ ముఠా.ఏం చేస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? తమ పార్టీ నేతలను ఏమైనా సంప్రదిస్తున్నారా? ఎవరెవరు ఏ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? ఇలా కొన్ని డౌట్స్‌తో నేతల ఫోన్లను ట్యాప్ చేశారనుకుందాం. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, హవాలా దందా చేసే వారి ఫోన్లను ట్యాప్ చేయడం ఎందుకు? ఇప్పుడీ కృశ్చనే కాస్త ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి అప్పుడు టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ఆరోపణలను రిమైండ్ చేసుకోవాలి.ఇవే అప్పుడు ఆయన చేసిన అలిగేషన్స్. అప్పటి అలిగేషన్స్‌కు.. ఇప్పుడు బయటపడుతున్న విషయాలకు లింక్ ఉన్నట్టు అనిపిస్తోంది కదూ. ఫండ్స్ మరే ఇతర పార్టీకి వెళ్లకుండా అడ్డుకోవడం ఫస్ట్ టార్గెట్ అయితే.. ఆ ఫండ్స్ మొత్తం బీఆర్ఎస్‌కే రావడం సెకండ్ టార్గెట్. ఇదే కాన్సెప్ట్‌తో ట్యాపింగ్ దందా కొనసాగిందన్న ఆరోపణలకు ఇప్పుడు బలం చేకూరింది. 36 మంది రియల్ఎస్టేట్ బిల్డర్లు.. జ్యువెలరీ వ్యాపారుల ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఇదీ అఫిషియల్ ఇన్ఫర్మేషన్.. ఫోన్లు చేయడం.. డబ్బులు డిమాండ్ చేయడం.. ఫలానా నేతతో ఎందుకు మాట్లాడుతున్నావని బెదిరించడం. ఇవీ ఇప్పటి వరకు తెలిసిన విషయాలు.. మరిన్ని విషయాలు బయటికి రావాల్సి ఉంది.ప్రస్తుతం విచారణలో నోరు తెరుస్తున్నారు అధికారులు.. SIB చీఫ్ ప్రభాకర్ రావు చెప్తేనే ఫోన్ ట్యాప్ చేశారు. భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన నెంబర్స్ కూడా ట్యాప్ చేశాను. మా కాన్సన్‌ట్రేషన్ మొత్తం నేతల కదలికలు, నిధుల సమీకరణ.. సొసైటీ పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న కొందరి ఫోన్లు కూడా ట్యాప్ చేశాం. చేసిందంతా ఉన్నతాధికారులు చెప్పారనే.. ఇదీ పోలీసుల విచారణలో %ూ×దీ% మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు చెప్పిన విషయాలు. అంతేకాదు హార్డ్ డిస్కులు ఎందుకు పనికిరాకుండా డిస్ట్రాయ్ చేసి.. ఆ ముక్కలను వెళ్లి మూసీలో నిమజ్జనం చేశామన్నారు ప్రణీత్‌రావు.మరో కీలక అధికారి కూడా భుజంగరావు కూడా నోరు తెరుస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత ఇచ్చిన నెంబర్స్‌ను మాత్రమే ట్యాప్ చేశాను. ఆ నేతలిచ్చిన నంబర్స్.. ప్రణీత్‌రావుకు.. ప్రణీత్‌రావు ఇచ్చిన ఇన్ఫోని.. మళ్లీ బీఆర్ఎస్ నేతకు అందించాడు. ఈ ఆపరేషన్ అంతా ఎలా జరిగిందో విచారణలో పూసగుచ్చినట్టు చెప్పారు భుజంగరావు.సో.. ఇద్దరి స్టేట్‌మెంట్స్‌ను చూస్తే.. బీఆర్ఎస్ నేతలు, ఖాకీ పెద్దలు, వీరి డైరెక్షన్‌లోనే జరిగింది ఈ దందా అంతా. ప్రస్తుతం రాధాకిషన్ రావు, ప్రభాకర్ రావులో యూఎస్‌లో ఉన్నారు. కానీ ఇక్కడ ఇన్వెస్టిగేషన్ మాత్రం ఆగడం లేదు.మనం ముందు నుంచే చెబుతున్నాం. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో వీళ్లంతా పాత్రధారులే.. సూత్రధారులు ఇంకా వేరే వాళ్లు ఉన్నారని. ఇప్పుడదే నిజమైంది. ప్రణీత్‌రావు నోటి నుంచి ఇప్పటికే పలువురు కీలక నేతల పేర్లు వచ్చాయని తెలుస్తోంది.బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న ఆ నేతలకు త్వరలోనే నోటీసులు వెళ్లనున్నాయి. మరి వారి నోటి నుంచి ఎలాంటి ఆన్సర్స్ వస్తాయి. అనేది ఇప్పుడు కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది.కానీ ఇక్కడ సమాధానం రావాల్సిన కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. వ్యాపారులను ఎందుకు బెదిరించారు? అలా బెదిరించి వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి చేరాయి? ఎవరికి చేరాయి ? ఎవరి డైరెక్షన్‌లో ఇదంతా జరిగింది ? అనేది ఇప్పుడు కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది. ప్రస్తుతం పోలీసుల స్పీడ్ చూస్తుంటే.. అతి త్వరలో వీటికి కూడా ఆన్సర్స్ బయటపడటం.. కొందరు గులాబీ పెద్దలు శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

# బీజేపీ అభ్యర్థులు గెలుపు గుర్రాలేనా?



అమరావతి,బీజేపీ అధిష్టానం తాజాగా.. ఆరు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. వీరిలో ఒక్క నరసాపురం పార్లమెంటు స్థానం టికెట్‌ను దక్కించుకున్న భూపతిరాజు శ్రీనివాసవర్మ తప్ప.. మిగిలిన వారంతా.. ఏడాది, లేదా రెండేళ్ల కిందట(ఒక్క పురందేశ్వరి మినహా. ఈమె 2019 ఎన్నికలకు ముందు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు) పార్టీలోకి వచ్చిన వారే. అయినప్పటికీ.. వీరికి పార్టీ కీలకమైన ఎంపీ స్థానాలను కట్టబెట్టింది.

వీరిలో వివాదస్పద నాయకు రాలుగా పేరున్న కొత్తపల్లి గీతకు ఏకంగా అరకు స్థానం ఇచ్చారు.ఇక, తెలంగా ణలో ఉంటూ.. ఏపీలో టికెట్ సంపాయించుకున్నారు మాజీ సీఎం కిరణ్‌కు మార్‌రెడ్డి. ఈయన రాజంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఇక, టీడీపీ నుంచి 2020లో బీజేపీలో చేరిన సీఎం రమేష్‌కు అనకాపల్లి పార్లమెంటు స్థానం ఇచ్చారు. ఈయన ఇక్కడ నాన్‌లోకల్.అయితే.. వెలమ నాయుళ్ల కులం కావడం.. విజయనగరం, శ్రీకాకుళంలలో ఈ కమ్యూనిటీ ఎక్కువగా ఉండడంతో ఈ సీటును ఆయనకు కేటాయించారనే చర్చ సాగుతోంది.ఇక, తిరుపతి పార్లమెంటు స్థానం మరీ క్యామెడీ అయిపోయిందని బీజేపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. నిన్నటి వరకు వైసీపీలో ఉన్న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌ను తీసుకువచ్చి.. తిరుపతి సీటు ఇచ్చారు. కానీ, ఈయనకు బీజేపీ నేతలతో ఎక్కడా టచ్ లేదు. కనీసం మాటలు కూడా లేవు. అయినా.. వరప్రసాద్‌కు ఇచ్చారు. దీంతో వీరి గెలుపు ఎలా? అనేది పార్టీ వర్గాలు చర్చిం చుకుంటున్నాయి. వీరంతా బలమైన సంపన్నులే అయినా.. సొమ్ములు ఖర్చు పెట్టేందుకు పెద్దగా ముందుకు వచ్చే పరిస్థితి లేదు.దీంతో బీజేపీ టికెట్లు ఇచ్చినా.. క్షేత్రస్థాయిలో వీరితో కలిసి నడిచే నాయకులు లేకపోవడం గమనార్హం. అరకులో కొత్తపల్లిగీతను ఎస్టీ సామాజిక వర్గం నాయకులు ఎప్పుడో దూరం పెట్టారు. ఈమె చంచెల స్వభావమే ఈమెను ప్రజలకు దూరం చేసింది. వైసీపీలో గెలిచిన తర్వాత.. 2014లో అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్‌కు కనీసం మొహం కూడా చూపించకుండా టీడీపీకి జై కొట్టింది. తర్వాత. సొంత పార్టీ పెట్టుకుంది. ఆ తర్వాత.. దీనిని బీజేపీలో విలీనం చేసింది. ప్రజలు ఆమెకు మద్దతివ్వడం కష్టమనే వాదన వినిపిస్తోంది. ఇలా.. అభ్యర్థులను ప్రకటించిన.. గెలుపు గుర్రాలు ఎక్కడం కష్టమనే వాదన వినిపిస్తోంది.

# బెంగళూరులో తీవ్రనీటి సమస్య.. ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు ఫైన్..



బెంగళూరు:సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే ఐటీ సిటీ బెంగళూరులో నీటి కొరతతో అల్లాడుతోంది. రోజురోజుకూ అక్కడ నీటి కరవు పరిస్థితులు పెరుగుతున్నాయి. కనీస నీటి అవసరాలు కూడా తీరని పరిస్థితి కనిపిస్తోంది. ఐటీ ఉద్యోగుల పరిస్థితే అధ్వాన్నంగా ఉంటే.. ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో ఊహించుకోండి. నగరానికి తాగునీటిని సరఫరా చేసే కావేరీ జలాలు ఒకపక్క, బోరుబావులు మరోపక్క అడుగంటి పోవడంతో.. చుక్కనీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి. నెలకు ఐదుసార్లు మాత్రమే స్నానాలు చేస్తున్నారు. అంటే సుమారుగా వారానికి ఒకసారి మాత్రమే స్నానం.తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో ఐటీ కంపెనీలు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తున్నాయి. కొందరైతే సిటీ ఖాళీ చేసి.. సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఇంత తీవ్రమైన నీటి కరవులోనూ కొందరూ నీటిని వృథా చేస్తున్నారు. అనవసరంగా నీటిని వాడి.. వృథా చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. సోషల్ మీడియాలో ఫిర్యాదు రావడంతో.. ఆదేశాలను ఉల్లంఘించి నీటిని వృథా చేసిన వారికి భారీ జరిమానా విధించారు. 22 కుటుంబాలకు.. ఒక్కో కుటుంబానికి 5 వేల రూపాయల చొప్పున మొత్తం లక్ష 1000 రూపాయిలు ఫైన్ వేశారు.నగరంలో తీవ్ర నీటికొరత ఉండగా.. తాగునీటి సంరక్షణకు ఇచ్చిన ఆదేశాలను 22 కుటుంబాలు అతిక్రమించడంతోనే ఫైన్ వేసినట్లు బెంగళూరు నీటి సరఫరా మురుగునీటి బోర్డు వెల్లడించింది. ఫైన్లు విధించిన ఆ 22 కుటుంబాలు తాగునీటిని కార్ వాష్ లకు, చెట్లకు నీరు పోసేందుకు ఉపయోగించారని, దీనివల్ల నీరు వృథా అయిందని తెలిపారు. ఈ క్రమంలో మరోసారి నగరవాసులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఇంకెలాంటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందోనని నగరవాసులు బెంగపడుతున్నారు.

# కంగనాపై పోటీకి రెడీ అంటున్న మాజీ సీఎం భార్య..



హిమాచల్: లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండి పార్లమెంట్ స్థానం నుంచి సినీ నటి కంగనా రనౌత్‌ను బీజేపీ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో.. ఈ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం మండి ఎంపీగా కాంగ్రెస్‌కు చెందిన ప్రతిభా సింగ్ ఉన్నారు. ఆమె హిమాచల్ ప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా కూడా ఉన్నారు. తన వయసు దృష్ట్యా ఈ ఎన్నికల్లో పోటీ చేయనని ఆమె అధిష్టానానికి తెలిపారు. అయితే బీజేపీ అనుహ్యంగా కంగనా రనౌత్ పేరును ప్రకటించడంతో ఆమె నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది.లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండి పార్లమెంట్ స్థానం నుంచి సినీ నటి కంగనా రనౌత్‌ను బీజేపీ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో.. ఈ నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం మండి ఎంపీగా కాంగ్రెస్‌కు చెందిన ప్రతిభా సింగ్ ఉన్నారు. ఆమె హిమాచల్ ప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా కూడా ఉన్నారు. తన వయసు దృష్ట్యా ఈ ఎన్నికల్లో పోటీ చేయనని ఆమె అధిష్టానానికి తెలిపారు. అయితే బీజేపీ అనుహ్యంగా కంగనా రనౌత్ పేరును ప్రకటించడంతో ఆమె నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది.హిమాచల్ మాజీ సీఎం వీరభద్ర సింగ్ భార్య అయిన ప్రతిభా సింగ్ మూడు సార్లు ఇక్కడి నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. వీరభద్ర సింగ్ సైతం ఇదే లోక్‌సభ స్థానం నుంచి మూడు సార్లు ఎంపీగా పనిచేశారు. కంగనా రనౌత్‌ను అభ్యర్థిగా ప్రకటించడంపై ప్రతిభా సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిష్టానం ఆదేశిస్తే కంగనాపై పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటించారు.

కంగనా ప్రకటనతో..

కంగనాను మండి లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిన తర్వాత రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. ప్రతిభా సింగ్‌కు మండి ప్రాంతంలో మంచి పేరుంది. కాగా.. ఈ ఎన్నికల్లో మరో అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని హైకమాండ్‌కు తన కోరిక చెప్పానన్నారు. కంగనా రనౌత్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె తన నిర్ణయాన్ని మార్చుకుంటున్నట్లు తెలిపారు. హైకమాండ్ పోటీ చేసే బాధ్యత అప్పగిస్తే, తాను వెనక్కి తగ్గబోనన్నారు.

# మైనారిటీ స్థానంలో బీసీలకు చోటు.. కేసీఆర్ వ్యూహామేంటి?



హైదరాబాద్,పక్కా మైనారిటీ స్థానంగా పేరొందిన హైదరాబాద్ పార్లమెంటు స్థానానికి బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బీసీ నేతను ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక.. అనేక చర్చలు తెరమీదికి వచ్చాయి. ఇప్పటికే 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తాజాగా మిగిలిన ఆ ఒక్క స్థానానికి అభ్యర్థిని ఫైనల్ చేశారు. హైదరాబాద్ స్థానం నుంచి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేరును ప్రకటించారు.కాంగ్రెస్, బీజేపీ మాత్రం ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అయితే.. బీజేపీ మాత్రం హైదరాబాద్ సీటును మాధవీలత కు కేటాయించింది. ఆమె ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లో ఆమె దూకుడు ప్రదర్శిస్తున్నారు. మరికొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇదిలావుంటే.. అనూహ్యంగా కేసీఆర్ హైదరబాద్‌కు బీసీకి చెందిన శ్రీనివాస్ యాదవ్‌ను ప్రకటించడం ఆశ్చర్యంగా ఉంది. వాస్తవానికి మైనారిటీ నాయకులు చాలా మందే ఉన్నారు.కానీ, వారెవరినీ.. కేసీఆర్ పరిగణనలోకి తీసుకోలేదు. కనీసం ఎవరిని సంప్రదించారో కూడా తెలియదు కానీ.. అనూహ్యంగా శ్రీనివాస్ యదవ్ పేరును మాత్రం ప్రకటించారు. అయితే.. ముస్లిం మైనారిటీ పార్టీ ఎంఐఎంతో కేసీఆర్ తన బంధాన్నికొనసాగిస్తున్నారు. ఈ పార్టీకి హైదరాబాద్ కంచుకోట. గతం నుంచి ఈ పార్టీనే ఇక్కడ విజయం దక్కించుకుంటోంది. ఈ నేపథ్యంలో మైనారిటీ నేతకు కాకుండా.. బీసీ కి ఇవ్వడం ద్వారా కేసీఆర్ ఎంఐఎంకు పరోక్ష సహకారం అందిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.ఎంఐఎంపై అసంతృప్తి ఉన్నవారు.. బీసీలు.. ఓట్లు చీలిపోయి.. ఎంఐఎంకి మేలు చేయాలన్న వ్యూహంతో నే కేసీఆర్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారనే చర్చ సాగుతుండడం గమనార్హం. నేరుగా ఎంఐఎంతో పొత్తు పెట్టుకోకుండా.. చేతులు మాత్రమే కలిపిన బీఆర్ఎస్.. ఆ పార్టీ కోసం..ఈ టికెట్‌ను ఇలా పరోక్షంగా త్యాగం చేసిందని చెబుతున్నారు. బీసీ నేతకు ఇక్కడ అవకాశం ఇచ్చి.. ఎంఐఎం వ్యతిరేక ఓటును బీజేపీకి పడకుండా చేయడమే దీని వెనుక వ్యూహంగా ఉందని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## రైతులకు అండగా ఉంటాం

నిజామాబాద్,పసుపు రైతులకు మేలు చేసేది కేవలం బిజెపి మాత్రమేనని ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ మాయమాటలతో రైతులను మోసం చేయడంతో పాటు మద్దతు ధరల విషయంలో చేతులెత్తేసారని మండిప్డడారు. సమస్యలు పరిష్కరించడంలో కెసిఆర్‌కు ఏనాడూ చిత్తశుద్ధి లేదని అన్నారు. రైతులకు అండగా ప్రధాని నిలిచారని అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు హామీని నిలుపుకున్నామని వారికి తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు.

## సంపాదకీయం

**బుధవారం 27-03-2024**

# ఎన్నికల ప్రచారంలో ఇక రాజధాని రగడ !

మనకు గుండెకాయ ఎలాంటిదో రాజధాని అన్నది కూడా అలాంటిదే. వెసలుబాటు కోసం కాలానుగుణంగా అక్కడోచోట, ఇక్కడో చోట రాజధాని పెట్టుకుని కార్యకలాపాలు నడుపుకుని ఉండవచ్చు. కాన రాజధాని మాత్రం ఒక్కటే అన్నది గుర్తించాలి. ఏ దేశానికైనా..అలాగే ఏ రాష్ట్రానికైనా ఒకే రాజధాని ఉండాలి. ఉంటుంది కూడా..ఎక్కడో ఒకచోట అవకాశాలను బట్టి అదికూడా వాతావరణాల కారణంగా రెండో రాజధాని ని కేవలం సమావేశాల కోసం ఏర్పాటు చేసుకుంటారు. రాజధాని అంటే అది గుండెకాయ లాంటిది. కానీ ఖర్మమేంటో కానీ ఎపికి ఇప్పుడు రాజధాని అన్నది లేకుండా పోయింది. అదే ఇప్పుడు ఎన్నికల్లో ప్రధాన ఎజెండా కాబోతున్నది. దీనిని ఎన్‌డిఎ కూటమి బలంగా చాటబోతున్నది. గత ఐదేళ్లలో సిఎం జగన్ రాజధాని అన్నది లేకుండా పాలన చేశారు. మూడు రాజధానులు అంటూ నాన్చారు. జగన్‌కు అనేక ఆలోచనలు ఉండవచ్చు. కానీ అవన్నీ అభివృద్ధిక దోహదం చేసేవిగా ఉండాలి. అలాచేసివుంటే ఇవాళ జగన్ నాయకత్వం మరింత బలోపేతం అయ్యేది. రాజధాని తాను అనుకున్నట్లుగా విశాఖకు తరలించి, కేంద్రంతో మాట్లాడుకుని దానినే రాజధాని చేసినా మంచి పేరు వచ్చి ఉండేది. కానీ ఆలాకూడా చేయలేదు. ఐదేళ్లుగా అమరావతి రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించు కోలేదు. పోలీస్ జులుంతో వారిని అణచి వేశారు. ఇప్పుడు వారంతా ఎన్నికల్లో పాల్గొనేందుకు తమ అమరావతి ఉద్యమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. ఓ వైపు అమరావతినే కొనసాగించాలని భూములు ఇచ్చిన రైతులు ఐదేళ్లుగా చేస్తున్న ఆందోళనకు విరామం ప్రకటించారు. గత ఐదేళ్లలో సిఎం జగన్ అడుగడుగునా నిబంధనల పేరుతో వారి ఆందోళనలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పాదయాత్రలను చేసిన సిఎం జగన్ ఆనాటి సంగతులను మరచి రైతులను అడ్డుకున్న తీరు దారుణం కాక మరోటి కాదు. అలాగే రాజధానిపై రైతులు ఆవేదనను అర్థం చేసుకుని తప్పులు సరిదిద్దుకోవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఈ క్రమంలో కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఇది రాష్ట్ర వ్యవహారంగా చెప్పి తప్పించు కుంది. అంతో ఇంతో రాజధాని కోసం కృషి చేసిన టిడిపిని అదేపనిగా విమర్శించడమే లక్ష్యంగా మంత్రులు, సిఎం పనిగా పెట్టుకున్నారు. అమరావతి ఉద్యమాన్ని టిడిపి నడిపిస్తున్న ఉద్యమంగా చూపి తప్పించుకున్నారు. ఈ వ్యవహారం రేపటి ఎన్నికల్లో తప్పకుండా ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు. అధికారంలోకి వచ్చిన జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకుని వచ్చి..తాను పట్టిన ఎపికి మూడు రాజధానులంటూ నిప్పు రాజేశారు. ఈ క్రమంలో ఏపీ రాజధాని విభజన వ్యవహారం చిచ్చు రాజేసింది.నిజానికి విశాఖపై మక్కువతోనే ఈ తతంగం అంతా నడిపించారన్నది సుస్పష్టం. మూడు రాజధానులు చేస్తున్నాం అన్న ప్రకటన చూసి అంతా ముక్కున వేలేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యవహారంలో వైసిపి అభాసు పాలయ్యింది. సిఎం జగన్ తీరును తప్పు పట్టారు. మూడు ప్రాంతాలకు న్యాయం చేస్తాం అంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు చూసి నవ్వుకున్నారు. ఏ ప్రాంతానికి అయినా న్యాయం చేయడం వేరు..రాజధాని ఒక్కటే ఉండడం వేరన్న స్పృహలో వైకాపా నేతులు కాని, నాయకుల కానీ లేకుండాపోయింది. నిజానికి రాజధాని ఏర్పాటు... అభివృద్ధి యావత్తూ దానిచుట్టూ పరిభ్రమించాలి. నిరుద్యోగులకు బాసటగా నిలవాలి. కానీ ఎపిలో వైకాపా అధికారంలోకి రాగానే రాజధాని విషయంలో గందరగోళం రేపింది. దీంతో రెండేళ్లుగా దీనిపై ఆందోళనలు..కోర్టులు.. నాయకుల చుట్టూ వ్యవహారం తిరుగుతూ సమస్య మరింత జటిలంగా మారింది. ఈ క్రమంలో కేంద్రం కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది.. అయోధ్య రామాలయ సమస్య తీరినా ..ఈ సమస్య తీరేలా కనిపించలేదు. రాజధాని ఒక్కటే...అది విశాఖ మాత్రమేనని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించినా అదికూడా నెరవేర్చుకోలేక పోయింది. విశాఖపట్నాన్నే పూర్తి స్థాయి రాజధానిగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, ఆ పని చేసినా బగుండేది. కానీ అలా కాకుండా తప్పించుకునేందుకు మూడు రాజధానులు అంటూ మెలికలు పెట్టి కాలయాపన చేసింది. విపక్షంపై దుమ్మెత్తి పోసి కాలం గడిపింది. దీనికి ఎన్నికల్లో సమాధానం చెప్పేందుకు స్పష్టమైన కారణం లేదు. రాయలసీమకు న్యాయ రాజధాని ఇచ్చేశామని, కర్నూలులో అది ఉంటుందని చెప్పుకున్నారు. అలాగే అమరావతిని అక్కడే ఉంచుతున్నాం.. దాని అభివృద్ధికి ఢోకా లేదన్నారు. అమరావతిని కదపట్లేదు అంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు కేవలం మాటల గారడిగానే.. మాయ మాటలుగానే మిగిలిపోయాయి. నిజానికి ఈ మూడు రాజధానుల ముచ్చట వెనక పెద్ద మతలబు ఉండివుంటుంది. అందుకే తాను పట్టిన కుందేటికి మూడే కొమ్ములు అన్న చందంగా మూడురాజధానుల వ్యవహారం నడిపించారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రజలు మాత్రమే గందరగోళానికి గురయ్యారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును సాకుగా చూపి ప్రజామద్దతు మాకే ఉంది..ఏమైనా చేస్తాం.. చెల్లుతుం దన్న భావనలో పాలకులు ఐదేళ్ల పాటు కాలయాపన చేశారు. దీనికి వారిచ్చే సమాధానం ప్రజలు ఆమోదించేదిగా లేదు. పేరుకు మూడు రాజధానులని చెబుతున్నప్పటికీ... అభివృద్ధి వికేంద్రీకరణ అని చెబుతున్నప్పటికీ.... రాజధానిని విశాఖకు మార్చాలన్నది ప్రభుత్వ ధృడ సంకల్పంగా మేరకు అయినా సాగివుంటే మంచి ఫలితం వచ్చేది. సముద్రతీరం కలిగి, ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖకు తొలినాళ్లలోనే రాజధాని తరలించివుంటే ఈ ఐదేళ్ల విశ్వాఖ రాజధాని హంగులను సంతరించుకుని ఉండేది. రాజధాని విశాఖ అంటే వ్యతిరేకత వస్తుంది కాబట్టే.. మూడు రాజధానులు అనే మాటను ప్రభుత్వం తెరపైకి తీసుకుని వచ్చిందని కొందరు చెబుతున్నారు. ప్రభుత్వం సృష్టించిన అమోయమయ సునామిలో పడి ఇప్పుడు రాజకీయ నేతలు విమర్శలు ప్రతి విమర్శలు చేస్తున్నారు. బిజెపి,టిడిపి,కాంగ్రెస్, కమ్యూనిస్టులు అంతా కూడా అమరావతిని తరలించవద్దని ప్రజలకు మద్దతుగా పోరాడాయి. అయోమయ పరిస్థితిని సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడడం ద్వారా ఓ ఉన్నత లక్ష్యాన్ని విస్మరించింది. మంత్రులు, అధికార పార్టీ నాయకులు తమ ప్రకటనలతో రాష్ట్ర ప్రజల్లోనూ, భూములిచ్చిన రైతుల్లోనూ తీవ్ర గందరగోళం రేపారు. ఈ క్రమంలో ఐదేళ్లపాటు ప్రచారంతో రాజధాని మరుగున పడింది. మరి రేపటి ఎన్నికల్లో జగన్ చెప్పే మాటలను ప్రజలు ఎలా తీసుకుంటాన్నది చూడాలి.

# కాంగ్రెస్‌లో అసమ్మతి..

హైదరాబాద్,రాష్ట్రంలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి 3 నెలలు తిరక్కుండానే ఆ పార్టీలో అసమ్మతి రాగాలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. ఇంతకాలం కాంగ్రెస్‌ను నమ్ముకొని ఉన్న నాయకులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి లోక్‌సభ ఎన్నికల టికెట్లు కేటాయించడాన్ని తప్పుబడుతూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఎల్ నిరంజన్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం ఇప్పటికే కలకలం సృష్టించింది. నిరంజన్ అభిప్రాయంతో తాజాగా కాంగ్రెస్ కురువృద్ధుడు వీ హనుమంతరావు గొంతు కలపడంతో ఆ పార్టీలో నివురుగప్పిన నిప్పులా రాజకుంటున్న అసమ్మతి ఒక్కసారిగా బట్టబయలైంది. మరోవైపు నామినేటెడ్ పోస్టుల చిచ్చు కాంగ్రెస్‌ను మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. దీంతో రాష్ట్రంలో కనీసం 12 లోక్‌సభ సీట్లను గెలుచుకోవాలన్న లక్ష్య సాధనకు పార్టీ శ్రేణులు మనస్ఫూర్తిగా సహకరించవేమోనని కాంగ్రెస్ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో దశాబ్దం తర్వాత కాంగ్రెస్‌కు అధికారం దక్కడంతో ఇంతకాలం ఆ పార్టీని నమ్ముకున్న నాయకులంతా తమకు మంచి రోజులు వస్తాయని గంపెడాశతో ఎదురు చూశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు టికెట్లు లభించకపోయినప్పటికీ కనీసం పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశమైనా దక్కుతుందని భావించారు. ఇప్పుడు ఆ ఆశలు కూడా ఆవిరైపోవడంతో సీనియర్లకు మింగుడు పడటం లేదు. మొన్నటి దాకా అధికారాన్ని అనుభవించిన నాయకులను అప్పటికప్పుడు కాంగ్రెస్‌లో చేర్చుకుని లోక్‌సభ టికెట్లు ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కొందరు నేతలు బాహాటంగానే అసమ్మతి గళాన్ని విప్పుతూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వ వైఖరిని తూర్పారబడుతున్నారు. దీంతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్లు దక్కించుకున్న అభ్యర్థులు కూడా ఆందోళన చెందుతు న్నారు. తమ విజయానికి పార్టీ క్యాడర్ సహకరిస్తుందా? లేదా? అని అనుమానిస్తున్నారు.

‘క్లియరెన్స్ సేల్’ చిట్కాతో..

కొత్త సరుకును అమ్ముకునేందుకు పాత సరుకును ‘క్లియరెన్స్ సేల్’ పేరుతో కారుచౌకగా అమ్మడం వ్యాపారులు అనుసరించే చిట్కా. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని టీపీసీసీ సైతం ఇదే విధానాన్ని అనుసరిస్తున్నది. ఖమ్మం ఎంపీ టికెట్‌ను తనకు అనువైన వ్యక్తికి ఇప్పించుకునేందుకు రేణుకా చౌదరిని రాజ్యసభకు పంపిన రేవంత్‌రెడ్డి.. వరంగల్ టికెట్‌ను ఆశించిన సిరిసిల్ల రాజయ్యకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ పదవిని, భువనగిరి టికెట్‌ను ఆశించిన పటేల్ రమేశ్‌రెడ్డికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టిన విషయం విధితమే. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను డాక్టర్ మల్లు రవికి కట్టబెట్టాలన్న ఆలోచనతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు రాష్ట్ర స్థాయి



కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇంతకాలం ఆయా పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో అసమ్మతి రాజుకుంటున్నది.

అగ్గి రాజేస్తున్న నామినేటెడ్ పోస్టులు

నామినేటెడ్ పోస్టుల పందేరం కూడా రేవంత్ మంత్రివర్గ సహచరుల మధ్య అగ్గి రాజేస్తున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేటెడ్ పోస్టులన్నీ మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులకే దక్కాయని అదే జిల్లాకు చెందిన మరో మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పదవులు ఇచ్చే ముందు మాటమాత్రానికైనా సంప్రందించలేదని సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరకు ఒక్క కార్పొరేషన్ పదవి కూడా దక్కకపోవడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహంతో రగిలిపోతున్నారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి విజయంలో కీలకభూమిక పోషించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తమ నామినేటెడ్ పోస్టులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ పదవులను స్వీకరించేందుకు వారు విముఖతతో ఉన్నట్టు సమాచారం. ఈ అసమ్మతి సెగలన్నీ ఏ క్షణమైనా భగ్గుమనే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అసమ్మతి నేతల ప్రెస్‌మీట్లపై ఆంక్షలు

రాష్ట్ర కాంగ్రెస్‌లో ముదురుతున్న అసమ్మతిని మొగ్గ దశలోనే తుంచేసేందుకు టీపీసీసీ అప్రమత్తమైంది. గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్లు పెట్టకుండా కట్టడి చర్యలు చేపట్టింది. ఎవరైనా ప్రెస్‌మీట్‌లో ఏ అంశంపై మాట్లాడబోతున్నారో తెలుసుకున్నాకే అనుమతి ఇవ్వాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించినట్టు తెలిసింది. కాంగ్రెస్‌ను ఇరకాటపెట్టే నాయకుల ప్రెస్‌మీట్లకు లైవ్ కవరేజీ ఇవ్వకుండా చూడాలని పార్టీ పెద్దల నుంచి మీడియా ఇన్‌చార్జికి ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం.

# ఈ కోర్టు చరిత్ర సువర్ణాక్షరాలతో రాయబడదేమో!


ఢిల్లీ,మద్యం పాలసీ కేసులో ఈడీ అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించింది. బెయిల్ కోసం కవిత దరఖాస్తు చేసి ఉంటే.. దానిపై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తన అరెస్టును రద్దు చేయాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈడీకి నోటీసులు జారీచేసింది. బెయిల్ కోసం కవితను ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించడంపై ఆమె తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ‘న్యాయస్థానాలు తమ వారసత్వాన్ని గుర్తుంచుకోవడం అవసరం. చరిత్రకారులు ఈ కోర్టు చరిత్రను రాసినప్పుడు.. నేటి ఈ కేసును మాత్రం స్వర్ణాక్షరాలతో లిఖించరు’ అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ‘సరే.. చూద్దాం..’ అంటూ ప్రతివ్యాఖ్య చేసింది.మద్యం విధానం కేసులో ఈడీ సోదాల పేరుతో వచ్చి అక్రమంగా అరెస్ట్ చేసిందని, సీబీఐ స్పెషల్ కోర్టు తనను కస్టడీకి ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమని పేరొంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 537 పేజీల పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కవిత తరఫున కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో కవిత నిందితురాలు కాదని సాక్షాత్తు సుప్రీంకోర్టుకు చెప్పిన ఈడీ ఆమెను ఎలా అరెస్టు చేస్తుందని ప్రశ్నించారు. నిరుడు సెప్టెంబర్‌లో నిందితురాలు కాదని, సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామని చెప్పిన ఈడీ అంతకుముందు ఆగస్టు నెలలో అప్రూవర్లు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం కవితపై కీలక ఆధారాలు ఉన్నాయంటూ అరెస్టు రిపోర్టులో ఎలా పేరొంటుందని ప్రశ్నించారు.ఆగస్టులోనే నిందితురాలని తెలిస్తే.. సెప్టెంబర్‌లో నిందితురాలు కాదని చెప్పడంలో ఔచిత్యం ఏమిటని పేర్కొన్నారు. ఈడీ సుప్రీంకోర్టుకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదని అన్నారు. ఒకటంటే ఒక సాక్ష్యం సంపాదించలేకపోయినా, ఎలాంటి ఆధారాలు లేకపోయినా కవితను అరెస్టు చేసిందని తప్పుపట్టారు. మద్యం కేసులో పిటిషనర్ కవిత నిందితురాలిగా లేరని, ఆ కేసును సిట్‌కు బదిలీ చేయాలని కోరే హకు ఆమెకు లేదని ఈడీ సుప్రీంకోర్టుకు చెప్పిందని గుర్తుచేశారు. కేవలం అప్రూవర్ల వాంగ్మూలాలను పట్టుకుని ఈడీ చీకట్లో బాణం వేస్తున్నదని, కవితను అన్యాయంగా అరెస్టు చేసిందని చెప్పారు.

అప్రూవర్ల వాంగ్మూలమే ఆధారమా?

కవితకు వ్యతిరేకంగా ఉన్న అన్ని స్టేట్‌మెంట్స్‌ను ఈడీ అప్రూవర్ల నుంచే తీసుకుందని సిబల్ చెప్పారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి వాంగ్మూలం ఆధారంగా కవితను నిందితురాలిగా పేరొంటున్నట్టు ఈడీ చెప్తున్నదని, కానీ ఆయనతోపాటు మరొకరి వాంగ్మూలాలను 2023 ఆగస్టులోనే తీసుకుందని గుర్తుచేశారు. అలాంటప్పుడు సెప్టెంబర్ 24న జరిగిన విచారణలో కవిత నిందితురాలు కాదని ఎలా చెప్తుందని ప్రశ్నించారు. ట్రయల్ కోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు చెప్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. జార?ండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ ట్రయల్ కోర్టుకు వెళితే ఏం జరిగిందో తెలిసిందేనని వ్యాఖ్యానించారు.

బెయిల్‌పై ట్రయల్ కోర్టులో తేల్చుకోండి

ఈ సమయంలో సిబల్ తిరిగి వాదిస్తూ, ఇదే సుప్రీంకోర్టులో గత ఏడాది సెప్టెంబర్ 24న ఈడీ సమర్పించిన వివరాలను పరిశీలించాలని కోరారు. “పిటిషనర్ కవిత నిందితురాలిగా లేరు. మద్యం కేసును సిట్‌కు బదిలీ చేయాలని కోరే హకు పిటిషనర్‌కు లేదు.’ అని ఈడీ స్వయంగా ఆ తేదీన సుప్రీంకోర్టుకు చెప్పిందని వివరించారు. ఇప్పుడు ఈడీ పిటిషనర్‌ను ఎలా అరెస్ట్ చేస్తుందని ప్రశ్నించారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి గత ఏడాది జూలై 14న ఇచ్చిన ప్రకటన, గోపీ కుమారం అనే వ్యక్తి అదే ఏడాది ఆగస్ట్ 8న ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ఈడీ చర్యలు ఉన్నాయని వివరించబోతుండగా సుప్రీంకోర్టు అడ్డుకుంది. ఈడీ దేశ అత్యున్నత న్యాయస్థానంలో చెప్పిన దానికి విరుద్ధంగా చేస్తున్నదని సిబల్ చెప్పారు. పిటిషనర్ కవిత నిందితురాలు కాదని అప్పుడు చెప్పిన ఈడీ ఆ తర్వాత ఏ ప్రాతిపదికపై పిటిషనర్‌ను అరెస్టు చేస్తుందని ప్రశ్నించగానే..



సుప్రీంకోర్టు కల్పించుకుని, కేసు మెరిట్స్‌లోకి వెళ్లవద్దని, రాజ్యాంగపరమైన అంశాలపై తాము జూలైలో విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

ఇక్కడ కాకుంటే ఎక్కడ చెప్పుకోవాలి?

కేసులోని కీలక విషయాలు వినలేమంటే ఏం చేయాలి అని సిబల్ ప్రశ్నించారు. ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 కింద ఎలా అరెస్టు చేస్తుందని, కేసులో నిందితురాలు కాదని సాక్షాత్తు సుప్రీంకోర్టుకు చెప్పిన తర్వాత అరెస్టు చేయడంలో ఔచిత్యం ఏమిటని మరోసారి అడిగారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన మాటకు భిన్నంగా చేస్తుంటే.. తాము ఇకడ కాకుండా ఎకడ చెప్పుకోవాలని ప్రశ్నించారు. ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు మళ్లీ బదులిచ్చింది. ఈ దశలో కవిత తరఫు మరో సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కల్పించుకొంటూ.. ఏదో చెప్పబోతుండగా.. సుప్రీంకోర్టు గతంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదని గుర్తుచేసింది. కవిత పిటిషన్‌ను ఏ కారణం చెప్పకుండానే ఉపసంహరించుకున్నారని చెప్పింది. ఈడీ అరెస్టు నేపథ్యంలో సమగ్ర వివరాలతో తాజా పిటిషన్ దాఖలు చేసిన కారణంగా గత పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నట్టు చౌదరి వివరించారు. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని చెప్పిన సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ట్రయల్ కోర్టు సత్వర విచారణ జరిపేలా ఆదేశాలివ్వాలని చౌదరి కోరగా అందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

అన్ని కేసుల్లో ఒకేతీరుగా వ్యవహరించాలి

ట్రయల్ కోర్టుకు వెళ్లాలని ఆదేశించడంపై కపిల్ సిబల్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అన్ని కేసుల విషయంలో ఒకే తీరుగా వ్యవహరించాలని కోరారు. కొందరు రాజకీయ నేతలు, ఆర్థిక స్థోమత ఉన్న వారు నేరుగా సుప్రీంకోర్టుకు వస్తే రాజ్యాంగంలోని 32వ అధికరణం కింద విచారణ చేయలేమని ధార్మసనం స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఈడీ ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్‌పై మరో రెండు వారాల్లో రిప్లయ్ కౌంటర్ దాఖలు పిటిషనర్‌ను చేయాలంది. తదుపరి విచారణను జూలై నెలకు వాయిదా వేసింది.

ఒక్క ఆధారమూ లేదు

విచారణ ప్రారంభం కాగానే కపిల్‌సిబల్ లేచి.. ‘దిల్లీ మద్యం కేసులో మా వాదనలు వినండి. దయచేసి హైకోర్టుకు వెళ్లండని మళ్లీ చెప్పవద్దు. ఇదే మా అభ్యర్థన. మాకు వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇచ్చినా ఏం పర్వాలేదు. ఇదే కోర్టులో చెప్పిన దానికి విరుద్ధంగా ఈడీ చర్యలున్నాయి. ఏం జరిగిందో వినండి. పిటిషనర్‌కు (కవిత) వ్యతిరేకంగా ఒకటంటే ఒక ఆధారం లేదు. ఈడీ ఒక సాక్ష్యాన్ని కూడా చూపలేదు. ప్రతిదీ అప్రూవర్ ప్రకటనపైనే ఆధారపడి కేసు దర్యాప్తు చేస్తున్నది. చిన్నపాటి సాక్ష్యాధారం కూడా లేదు. అప్రూవర్ ప్రకటనలనే ఈడీ ప్రామాణికంగా చేసుకుంటున్నది. పిటిషనర్‌ను చట్ట వ్యతిరేకంగా అన్యాయంగా అరెస్టు చేసింది’ అని వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. పిటిషన్‌లో రాజ్యాంగపరమైన అంశాలను ప్రస్తావించారని, ఇదే తరహాలో విజయ్ మదన్‌లాల్ దాఖలు చేసిన ప్రధాన కేసుతో పిటిషన్‌ను జత చేసి జూలైలో విచారణ చేస్తామని చెప్పింది.

# పీఎం కిసాన్‌పై లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్

న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం అనేది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు ఆదాయ మద్దతును అందించే రైతుల సంక్షేమ పథకం. ఈ పథకం కింద అర్హులైన రైతులందరికీ ఒక్కో కుటుంబానికి రూ.6000 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుంది. ఫిబ్రవరి 28న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 16వ విడతను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. మొత్తం రూ. 6,000 వార్షిక మొత్తంలో ప్రధానమంత్రి ఈ విడత రూ. 2,000 చొప్పున 9 కోట్ల మంది రైతుల ఖాతాలకు బదిలీ చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రధాని మోదీ విడుదల చేసిన మొత్తం రూ. 21 వేల కోట్లకు పైగా ఉంది. పీఎం-కిసాన్‌లో 9,01,67,496 మంది రైతులు లబ్ధి పొందారు. అయితే పీఎం కిసాన్ 17వ విడత సొమ్ము త్వరలోనే కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేయనుంది. పీఎం కిసాన్ 17వ విడత నిధులు పొందాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. పీఎం కిసాన్ వెబ్ సైట్ ప్రకారం పీఎం కిసాన్ నమోదు చేసుకున్న అర్హులైన రైతులకు ఈ-కేవైసీ తప్పనిసరి. పీఎం కిసాన్ పోర్టల్లో ఓటీపీ -ఆధారిత ఈ-కేవైసీ అందుబాటులో ఉంది. బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీ కోసం రైతులు సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాలను కూడా సంప్రదించవచ్చు.పీఎం-కిసాన్ పథకం షెడ్యూల్ ప్రకారం వాయిదాలు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి విడుదల చేస్తారు. గత ఏడాది నవంబర్లో విడుదల కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 16వ విడత విడుదలైంది. కాబట్టి పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత జూన్ 2024లో విడుదల అవుతుంది. అయితే లోక్ సభ ఎన్నికల కారణంగా ఇది ఆలస్యమయ్యే అకాశం ఉందని చెబుతున్నారు.

# తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్న మయన్మార్ సైన్యం

మయన్మార్,మయన్మార్ సైన్యం ప్రస్తుతం తీవ్రమైన ఒడుదొడుకులు ఎదుర్కొంటందని యూఎన్ ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ తెలిపారు. దాన్ని ఆ ముప్పు తప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. మయన్మార్ పై చాలా దేశాలు ఆంక్షలు విధించారని తెలిపారు. 2021లో అధికారంలోకి వచ్చిన జుంటా దళాలు గతంలో ఉన్న ప్రభుత్వాన్ని అణిచి వేశాయని వెల్లడించారు. మయన్మారు జుంటాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని యూఎన్ ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ తెలిపారు. దీన్ని సమర్ధవంతంగా అంతం చేయడానికి ప్రపంచం దేశాలు సహాయం చేయాలని అన్నారు. కొన్ని ఆంక్షలు విధించడం ద్వారా అది సాధ్యం అవుతుందన్నారు. జుంటా దళాల మధ్య భారీ ప్రాణనష్టం, ఫిరాయింపులు, లొంగుబాట్లు కారణంగా అవి బలహీన పడుతుందని వెల్లడించారు. ముఖ్యంగా రిక్రూట్ మెంట్ సవాళ్లను ఎదుర్కొనడంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని వెల్లడించారు. ఫిబ్రవరి 2021లో తిరుగుబాటు చేసి జుంటా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తర్వాత గత పదేళ్లుగా అక్కడి అధికారంలో ఉన్న ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని నాశనం చేసిందని వెల్లడించారు. దీని కారణంగా దేశాన్ని మరోసారి రక్తశిక్తం చేసిందన్నారు. ప్రస్తుతం దేశంలో దీర్ఘకాలంగా ఉన్న జాతి తిరుగుబాటు దళాలను అణిచివేయడానికి ప్రస్తుతం జుంటా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అన్నారు. అయితే ప్రస్తుతం దేశంలో హింస, అస్థిరత, ఆర్థిక క్షీణత ఏర్పాడడానికి ప్రధాన కారణం జుంటా అని ఆండ్రూస్ వెల్లడించారు.జుంటూ సింగపూర్ అందించే ఆయుధాల సరఫరాను చాలా వరకు తగ్గించిందని అన్నారు. ప్రస్తుతం జుంటాకు చైనా, రష్యా దేశాలే ప్రధానంగా ఆయుధ సమాగ్రిని సరాఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆదేశంలో ప్రపంచ దేశాలకు ఉన్న ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అవసరం ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రపంచం ఇతర ఘర్షణపై తన కేంద్రీకరించడం వల్ల మయన్మార్ పై తమ దృష్టి సన్నగిల్లిందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజాస్వామ్య, మానవ హక్కులను గౌరవించే మయన్మార్ ను నిర్మించడం చాలా అవసరం అని ప్రపంచ దేశాలకు తెలిపారు. అక్కడి ప్రజల మద్దతుగా అని దేశాలు సహకరించాలని కోరారు.

# లింగంపల్లిలో 10కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్, శేరిలింగంపల్లిలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు 10 కేజీల గంజాయి సీజ్ చేశారు. ఒడిస్సా నుంచి ఆంధ్ర మీదుగా హైదరాబాద్‌కు గంజాయిని పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లో స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని హైదరాబాద్ లో ఓ వ్యక్తి అప్పగించే ప్లాన్ చేస్తుండగా పట్టుకున్నారు. ఒడిస్సాకు చెందిన రాహుల్ అనే యువకుడిని రెడ్ హాండెడ్ గా పట్టుకున్నారు. గంజాయి చిన్న చిన్న ప్యాకెట్స్ లో ప్యాకింగ్ చేసి గచ్చిబౌలి ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు విక్రమ్ ఒప్పుకున్నాడు. హైదరాబాద్ కు చెందిన విక్రమ్, ఒడిస్సాకు చెందిన జగన్నాథ్ బిస్వా పరారీలో ఉన్నారు. ఎన్ డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో నిందితుడు దిగగానే 10 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఓ వ్యక్తి గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు లింగంపల్లి స్టేషన్‌కు చేరుకుని నిఘా ఉంచారు. రైలు దిగి స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకుడి బ్యాగులో ఉన్న 10 కిలోల గంజాయిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### కాళేశ్వరం డిజైన్లపై ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ ఆరా

హైదరాబాద్,నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ రెండో రోజు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో సమావేశమైంది. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ ఇంజినీర్లతో విడివిడిగా చర్చలు జరిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ డిజైన్ల వివరాలపై ఆరా తీస్తోంది. వాటిని రూపొందించిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఇంజినీర్లతో ఇప్పటికే బుధవారం సమావేశమైంది. గురువారం కూడా ఈ భేటీ కొనసాగింది. ప్రాజెక్టు నిర్మాణంలో బాధ్యులైన ఇంజినీర్లతో విడివిడిగా సమావేశమవుతున్న చంద్రశేఖర్ అయ్యర్, సభ్యులు.. డిజైన్లకు సంబంధించిన వివరాలు తీసుకున్నారు. ఆనకట్టల నిర్వహణ బాధ్యతలు చూసే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం నుంచి కమిటీ సమగ్ర వివరాలు కోరింది. 2019లో సమస్యలు ఉత్పన్నమైనప్పటి నుంచి తీసుకున్న చర్యలు, చేపట్టిన తనిఖీల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ పనులు చేసిన గుత్తేదార్ల ప్రతినిధులతోనూ నేడు సమావేశం కానుంది.

# మేలుకొలుపు కావాలి

బెంగళూరు, : బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వంసం చేయడం, చెరువుల, కాలువ ను ధ్వసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టెనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా, నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# డ్రైయిన్ల ఆధునీకరణ పట్టని పాలకులు

ఏలూరు, డ్రెయిన్ల ఆధునీకరణలో ఏ ప్రభుత్వం కూడా గట్టి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వీటిలో తూడు పెరగడం వల్ల నీటి సరఫరా ఆగిపోతోందని అన్నారు. ఆచంట నియోజకవర్గంలోని ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాల పరిధిలో నక్కల డ్రెయిన్ విస్తరించి ఉండడంతో వర్షాకాలం వచ్చిందంటే రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. నాలుగేళ్ల క్రితం ఈ డ్రెయిన్ ఆధునికీకరించిన అనతికాలంలోనే ఆక్రమణలు, పూడుకతో పరిస్థితి మరలా మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో కొద్దిపాటి వర్షం వచ్చిందంటే సమీపంలోని పంట పొలాలు ముంపుబారిన పడడం ఆనవాయితీగా మారింది. ఈ ఒక్క డ్రెయిన్ పరిధిలో మూడు మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల పంట భూములు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. కొఠాలపర్రు, తాడేరు, వల్లూరు డ్రెయిన్ పరిధిలో మరో 10 వేల ఎకరాలకు ప్రమాదం పొంచి ఉంది. అనేక గ్రామాల్లో డ్రెయిన్‌లో పలుచోట్ల గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోయింది. పెనుమంచిలి, ఆచంట, వల్లూరు వంతెన వద్ద ఇదే రీతిలో ఎగువ నుంచి వచ్చిన చెత్తా చెదారం భారీగా రాడడంతో నీరు కిందకు వెళ్లే మార్గం లేక పంట పొలాలను ముంచెత్తుతోంది. ప్రస్తుతం ఇదే పరిస్థితి తలెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే రెండు నెలల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉండడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు. నీరు లేకుండా నారుమడులు ఏ విధంగా వేయాలంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆచంట, వేమవరం, వల్లూరు, పెనుమంచిలి పరిసరాల శివారు భూములకు పంట కాలువ గుర్రపుడెక్కతో పూడుకుపోవడంతో నీరు ఆలస్యంగా అందింది.

# డ్రగ్స్ రాకెట్!

విజయవాడ : డ్రగ్స్ ..అదే మాదక ద్రవ్యాలు.. కొకైన్, హెరాయిన్ పేర్లు వినపడగానే.. సినీ సెలబ్రిటీస్ గుర్తుకు వస్తారు. తెలంగాణలో సినీ పరిశ్రమకు కేంద్రం కావటంతో.. మాదక ద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతుంది. అయితే.. ప్రతి సారి డ్రగ్స్ ముఠా దొరకటం ఆలస్యం.. నైజీరియా పెడ్లర్స్‌ను పట్టుకుని పోలీసులు అరెస్టు చూపిస్తారు. సినీ హీరోలు, బంధువులు, రాజకీయ ప్రముఖుల బిడ్డలు, పోలీసుల ఉన్నతాధికారుల బంధువులు తెరమీదకు రావటం.. మీడియాలో కథలు కథలు మార్మోగటం ఇప్పటిదాకా తెలిసిందే. కానీ, ఇప్పుడు ఏపీ ఆర్థిక రాజధానిని కేంద్రంగా చేసుకుని చేస్తున్న నయా దాందా వెలుగులోకి వచ్చింది. తెలంగాణలో డ్రగ్స్ కలకలం రేపితే.. ఆంధ్రాలో డ్రగ్స్ దిగుమతి కేసులు కలవరం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక రాజకీయ అండ ఉన్నదనే కథలు వినిపిస్తున్నాయి. కొన్నాళ్ల కిందట గుజరాత్‌లో ఓ షిప్‌లో ?500 కోట్ల విలువ చేసే కొకైన్ దొరికింది. దాని విలువ రూ.25వేల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇక.. గుజరాత్ ఓడరేవుకు, కాకినాడ రాజకీయ నాయకుడికి సంబంధం కూడా ప్రచారంలోకి వచ్చింది. తాజాగా ఏపీలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఈ ఆరోపణలు, పత్యారోపణలు జోరందుకున్నాయి. తాజాగా విశాఖపట్నంలో 25 టన్నుల కొకైన్ మిక్సిడ్ డ్రై ఈస్ట్ లభించడంతో ఇప్పుడు ఏపీ పేరు అంతర్జాతీయ స్థాయిలో మార్మోగిపోతోంది.

ఈ డ్రై ఈస్టుకు ఇంత పాపులారిటీ దేనికి?

డ్రై ఈస్ట్ పదార్థం అంటే నిజానికి ఓ వ్యర్థ పదార్థంలో ఉత్పత్తి. కుళ్లిన తియ్యని పండ్లు, ఆహార పదార్థాల నుంచి డ్రైఈస్ట్ తయారవుతుంది. ఈ డ్రైఈస్ట్కి ఆంధ్రప్రదేశ్ ఆక్వా కంపెనీకి సంబంధం ఏమిటీ? యూరప్ కంట్రీల్లో మిగిలిన ఆహార పదార్థాలను ఉచితంగా ఇచ్చేస్తారు. ఈ పదార్థాల నుంచి డ్రైఈస్ట్ తయారు చేసిన కంపెనీలు చాలా చౌకగా విక్రయిస్తాయి. దీంతో ఐరోపా దేశాల నుంచి డ్రైఈస్టు భారతీయ కంపెనీలు దిగుమతి చేసుకుంటాయి. ఎందుకంటే%ౌా% పశువుల మేతకు, చేపలు, రొయ్యల మేతకు డ్రైఈస్టు ఉపయోగిస్తారు. ఈ డ్రైఈస్టో ప్రొటీన్లు, సీ విటమిన్లు, భాస్వరం, అమినో ఆమ్లాలు ఉంటాయి. అంతే కాదు, డ్రైఈస్టును ఆల్కాహాల్ తయారీలోనూ వినియోగిస్తారు. అంటే బేవరేజెస్ కూడా డ్రైఈస్ట్ కోసం క్యూకడతాయన్న మాట.

# వ్లాదిమిర్ పుతిన్ ఎన్నిక పూర్వరంగం !



మార్చి 15 నుంచి 17 వరకు జరిగిన రష్యా ఎనిమిదవ అధ్యక్ష ఎన్నికలలో వ్లదిమిర్ పుతిన్ ఏకపక్షంగా విజయం సాధించారు. ప్రధాని లేదా అధ్యక్ష పదవిలో వరుసగా ఐదవసారి అధికార పీఠమెక్కి రికార్డు సృష్టించారు. పుతిన్ విజయం ఎన్నికలకు ముందే ఖరారైందని అంతర్జాతీయ మీడియా రాసింది. ప్రస్తుతం యావత్ రష్యన్లను జాతీయ భావాలు ప్రభావితం చేస్తున్నాయి. పుతిన్ అనుసరిస్తున్న ఆర్థిక, ఇతర విధానాల పట్ల దేశంలో జనమందరూ ఏకీభావంతో ఉన్నారని చెప్పలేంగాని 'నాటో' కూటమి తమను దెబ్బ తీసేందుకు ఉచ్చు బిగిస్తున్నదనే అంశంలో మాత్రం తరతమ తేడాలతో ఒకే వైఖరితో ఉన్నారనేందుకు తాజా ఎన్నికలే నిదర్శనం. పశ్చిమ దేశాల ప్రసార బాకాలు ఉక్రెయిన్ మీద జరుపుతున్న సైనిక చర్యను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎంతగా ప్రచారం చేసినా అధ్యక్ష ఎన్నికల్లో 77.49 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొనటం ఒక రికార్డు. గత ఎన్నికల కంటే 9.95 శాతం పెరిగింది. నిజంగా జనాలలో వ్యతిరేకత, ఆసక్తి లేకపోతే పోలింగ్ బూత్‌లకే రారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్యతో పశ్చిమ దేశాలు రష్యాను మరింతగా ఒంటరిపాటు చేసేందుకు చూడటం, ఆంక్షలు విధించటం తెలిసిందే. తాజా ఎన్నికల పూర్వరంగమిదే. రష్యాను ఒక బూచిగా చూపటమే కాదు, పద్దెనిమిదివేల ఆంక్షలు విధించారు. ఉక్రెయిన్‌కు దగ్గరగా ఉన్న ఎనిమిది ప్రాంతాలపై నాటో, అమెరికన్ మద్దతుతో దాడులు చేశారు. ఉక్రెయిన్‌లోని రష్యన్ జాతి వారిని అణచివేసేందుకు పూనుకున్నారు. రష్యాను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ కేంద్రంగా నాటో కూటమి దేశాలు జీవాయుధాలను తయారు చేస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం ఉన్న తరువాత రష్యా గద్దె మీద ఉన్న వారెవరైనా ఆ ముప్పును ఎదుర్కోవాల్సిందే. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కొన్ని జాతులను సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టి యుద్ధంలో ఎలా ఉపయోగించుకున్నారో అదే జాతులను ఇప్పుడు రష్యాకు వ్యతిరేకంగా సమీకరించటాన్ని చూసిన సామాన్య రష్యన్ పౌరులు మరోసారి తమకు ఫాసిస్టు ప్రమాదం ముంచుకువస్తున్నదని భావిస్తున్నారు. ఇదే అభిప్రాయం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న రష్యన్ కమ్యూనిస్టులలో కూడా ఉన్నకారణంగానే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను సమర్ధించారు. దీని అర్థం పుతిన్ విధానాలన్నింటినీ సమర్ధిస్తున్నట్లు కాదు. అందుకే ఉక్రెయిన్‌పై సైనిక చర్యను వ్యతిరేకించిన శక్తులను దేశ వ్యతిరేకులుగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ ఎన్నికలలో మొత్తం నలుగురు పోటీ చేస్తే పుతిన్‌కు 87.28 శాతం రాగా రెండవ స్థానంలో ఉన్న కమ్యూనిస్టు నేతకు 4.31 శాతం ఓట్లు వచ్చాయి. ధనిక దేశాల కూటమిలో చేరేందుకు ఉవ్విళ్లూరిన పుతిన్ గతం దాస్తే దాగేది కాదు. అయితే వాటి మధ్య తలెత్తిన వైరుధ్యాలు ఈ రూపం సంతరించుకుంటాయని మూడు దశాబ్దాల క్రితం ఎవరూ ఊహించలేదు. నయా ఫాసిస్టు శక్తులు, వాటిని వ్యతిరేకించే శక్తుల మధ్య వైరంగా చూసినపుడు అంతర్జాతీయ రాజకీయాల్లో పుతిన్‌ను పురోగామి శక్తులు సమర్ధిస్తున్నాయి. జాతీయ భావాలు అంటే రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీలో హిట్లర్ గ్యాంగ్ రెచ్చగొట్టిన జర్మన్ ఆధిపత్యవాదానికి, తమ దేశాన్ని కాపాడుకోవాలన్న రష్యన్ల భావనకు తేడా ఉంది. వ్లదిమిర్ పుతిన్ పురోగామి వాద, ప్రజాస్వామ్య పరిరక్షకుడో అని కితాబు ఇవ్వాల్సిన అవసరం లేదు. పూర్వపు సోవియట్ యూనియన్ వ్యవస్థలో ప్రజల సంపదగా ఉన్నదానిని గత మూడు దశాబ్దాల కాలంలో కొందరు ఆశ్రితులు, ప్రైవేటు పరం చేసిన వ్యవస్థ ప్రతినిధి పుతిన్. అయితే చమురు, సహజ వాయువు వంటి అపార సంపదలు ఇంకా ప్రభుత్వ రంగంలోనే ఉన్నప్పటికీ పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థ వైపే అడుగులు పడుతున్నాయి. రష్యాకు ఉన్న సహజ సంపదలు, మిలిటరీ, ఆయుధాల కారణంగా అది తమకు ఎక్కడ పోటీకి వస్తుందో అన్న భయంతో అమెరికా, ఐరోపా లోని ధనిక దేశాలు అడ్డుకొనేందుకు చూడటమే రష్యాతో వాటికి ఉన్న ప్రధాన వైరుధ్యం. ధనిక దేశాల కూటమి జి-7 లోకి రాకుండా ముందు చూశారు. తరువాత చేర్చుకొని, తిరిగి పక్కన పెట్టారు. నాటోను విస్తరించి రష్యా ముంగిట ఉన్న ఉక్రెయిన్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చి అదుపు చేయాలన్న ఎత్తుగడను పుతిన్ జయప్రదంగా వమ్ముచేశాడు. గతంలో రష్యా ప్రాంతంగా ఉండి సోవియట్ హయాంలో ఉక్రెయిన్ రిపబ్లిక్‌లో ఉన్న క్రిమియా ప్రాంతాన్ని 2014లో తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి రష్యాలో జాతీయ భావాలు మరింతగా పెరిగాయని చెప్పవచ్చు. ప్రస్తుతం పుతిన్ బలం అదే!

# ఉజ్జయిని మహాకాల్ ఆలయంలో ప్రమాదం..

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలోని మహాకాల్ ఆలయంలో ఈ ఉదయం ప్రమాదం సంభవించింది. గర్భగుడిలో హెూలీ రోజున జరిగే భస్మ హారతి సందర్భంగా గులాల్ ఊదడంతో మంటలు వ్యాపించడంతో పాటు 13 మందికి గాయాలయ్యాయి. కాలిపోయిన వారిలో పూజారులు, సేవకులు ఉన్నారు. క్షతగాత్రులందరినీ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహాకాల్ ఆలయంలో, భస్మర్తి ప్రధాన పూజారి, సంజయ్ గురు, వికాస్ పూజారి, మనోజ్ పూజారి, అన్ష్ పురోహిత్, సేవకుడు మహేష్ శర్మ, చింతామన్ గెహ్లాట్ పలువురు గాయపడ్డారు. భస్మ హారతి సమయంలో కూడా గులాల్ వాడతారని ఉజ్జయిని కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ తెలిపారు. భస్మ హారతి సందర్భంగా ఇవాళ గర్భగుడిలో కర్పూరం వెలిగించగా, లోపల ఉన్న 13 మంది పూజారులు కాలిపోయారు. వీరిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లోతైన గాయాలు లేవు, అన్నీ స్థిరంగా ఉన్నాయి. వైద్యులు వారికి చికిత్స చేస్తున్నారు. ఆలయంలో దర్శనం సజావుగా సాగుతోంది. ఆలయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. ఆ సమయంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జ్యోతిర్లింగ మహాకాళేశ్వరా లయంలో వేలాది మంది భక్తులు ఉండేవారు. అందరూ మహాకాల్‌తో హెూలీని జరుపుకున్నారు. ఆరతి చేస్తున్న పూజారి సంజీవ్‌పై వెనుక నుంచి ఎవరో గులాల్ పోశారని గాయపడిన సేవకుడు చెప్పాడు. గులాల్ దీపం మీద పడ్డాడు. గులాల్‌లో రసాయనాలు ఉండటం వల్లే మంటలు చెలరేగి ఉండవచ్చు. మరోవైపు, గర్భగుడి వెండి గోడకు రంగు, గులాల్ నుండి రక్షించడానికి అక్కడ రేకులు ఉంచబడ్డాయి. వీటిలో కూడా మంటలు వ్యాపించాయి. మంటలు చెలరేగడంతో కొంత మంది అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేశారని తెలిపారు. అయితే అప్పటికి గర్భగుడిలో హారతి చేస్తున్న సంజీవ్ పూజారి, వికాస్, మనోజ్, సేవాధారి ఆనంద్ కమల్ జోషి సహా 13 మంది కాలారు. ఈ విషయమై కలెక్టర్ నీరజ్ సింగ్ మాట్లాడుతూ.. దీనిపై విచారణకు ఆదేశాలు జారీ చేశామన్నారు. దీనిపై ఓ కమిటీ విచారణ జరుపుతుంది.

# ఎన్నికల్లో కొట్టుకుపోయిన కరువు



అమరావతి : రబీలో ఈ మారు తీవ్ర కరువు నెలకొనగా, ఆ సమస్య ఎన్నికల్లో కొట్టుకుపోయింది. ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలోనూ ప్రభుత్వం కరువుకు కోతలు పెట్టింది. ఎన్నికల్లో తలమునకలై సీజన్ ముగుస్తున్నా కరువుపై పట్టించుకోకుండా, చివరి నిమిషంలో.. అదీ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేశాక, హడావిడిగా ఆరు జిల్లాల్లోని 87మండలాల్లో కరువును గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో బిజీగా ఉన్న టిడిపి, జనసేన కరువును విస్మరించాయి. కేంద్రం నుంచి రాష్ట్రానికి యుద్ధ ప్రాతిపదికన తగిన సాయం తీసుకురావాల్సిన బిజెపి గమ్మునుంది. పంటలు సాగుకాక, వేసిన పంటలు దెబ్బతిని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమను ఆదుకోవాలని ఆశగా ఎదురు చూస్తున్నారు. కత్తెర్లు: ఖరీఫ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 300 మండలాలకు పైన తీవ్ర కరువుండగా, కేంద్ర డ్రాట్ మాన్యువల్ మేరకు అక్టోబర్ 31 లోపు కరువు మండలాలను ప్రకటించాల్సి ఉండగా, చివరి రోజు ఆఖరి ఘడియల్లో 101 తీవ్ర, రెండు మధ్యస్త స్థాయి వెరశి 103 మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. రబీనీ కరువు వెంటాడింది. ఈశాన్య రుతుపవన కాలం అక్టోబర్-డిసెంబర్ కాగా, ఈ సమయంలో 661 మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నట్లు ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయి. 255 మండలాల్లో సింగిల్, 378 మండలాల్లో డబుల్, 28 మండలాల్లో ట్రిపుల్ డ్రైస్పెల్స్ నెలకొన్నట్లు పేర్కొన్నాయి. రబీ అక్టోబర్ 1 నుంచి మొదలుకాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ నెలలోనూ సరైన వర్షాల్లేవు. అక్టోబర్‌లో 87.7 శాతం తక్కువ వర్షం పడింది. ఆ నెలలో 55 మండలాల్లో చినుకు లేదు. 583 మండలాల్లో అత్యల్ప స్థాయి, 39 మండలాల్లో తక్కువ స్థాయి వర్షం నమోదైంది. ఆ నెలకొచ్చేసరికి 598 డ్రైస్పెల్ మండలాలున్నాయి. నవంబర్‌లో 31.5 శాతం తక్కువ వర్షం కురిసింది. మూడు మండలాల్లో అస్సలు వాన లేదు. 241 మం డలాల్లో అత్యల్ప, 218 మండలాల్లో తక్కువ వర్షం పడింది. ఆ నెలలో 466 మండలాల్లో డ్రైస్పెల్స్ ఉన్నాయి. డిసెంబర్‌లో మిచౌంగ్ తుపాన్ వలన సగటున 546 శాతం వర్షం అధికంగా పడింది. అయినప్పటికీ 8 మండలాల్లో చినుకు లేదు. 99 మండలాల్లో అత్యల్ప, 20 మండలాల్లో తక్కువ వర్షం రికార్డయింది. జనవరిలో 77.5 శాతం, ఫిబ్రవరిలో 98.7 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మార్చిలోనూ అదే పరిస్థితి. 14 లక్షల ఎకరాల్లో సాగు లేదు: రబీలో కావాల్సిన సాధారణ సాగు విస్తీర్ణంలో 14 లక్షల ఎకరాలు సాగు లేక బీడు పడ్డాయి. ఆహార పంటలు 26 శాతం విస్తీర్ణంలో సేద్యం కాలేదు. వరి 29 శాతం, పప్పులు 27 శాతం సేద్యం కాలేదు. వేసిన పంటలు సైతం ఎండుతున్నాయి. విద్యుత్ కోతలు, కాల్వలకు నీరు అందకపోవడం, భూగర్భజలాలు తగ్గడం వలన లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మిచౌంగ్ తుపాన్ వలన ఖరీఫ్ పంటలు పోయాయి. పంట నష్ట పరిహారం రైతులందరికీ అందలేదు. ఇచ్చిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ చాలా తక్కువ. బీమా ఏమైందో తెలీదు. ఖరీఫ్‌లో ప్రకటించిన మండలాలే తక్కువ కాగా రుణాల రీషెడ్యూల్, తిరిగి పంటలేసుకోడానికి సబ్సిడీ రుణాలు, ఇతర సహాయ కార్యక్రమాలు అందించలేదు. గ్రామాల్లో, నగరాల్లో, పట్టణాల్లో తాగునీటి, కూలీలకు ఉపాధి సమస్యలు ఉన్నాయి. ఎన్నికల హడావిడిలో ఉన్న యంత్రాంగం పట్టించుకునే స్థితిలో లేదు. డ్రైస్పెల్స్ ఉన్నాయి. డిసెంబర్‌లో మిచౌంగ్ తుపాన్ వలన సగటున 546 శాతం వర్షం అధికంగా పడింది. అయినప్పటికీ 8 మండలాల్లో చినుకు లేదు. 99 మండలాల్లో అత్యల్ప, 20 మండలాల్లో తక్కువ వర్షం రికార్డయింది. జనవరిలో 77.5 శాతం, ఫిబ్రవరిలో 98.7 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మార్చిలోనూ అదే పరిస్థితి. 14 లక్షల ఎకరాల్లో సాగు లేదు: రబీలో కావాల్సిన సాధారణ సాగు విస్తీర్ణంలో 14 లక్షల ఎకరాలు సాగు లేక బీడు పడ్డాయి. ఆహార పంటలు 26 శాతం విస్తీర్ణంలో సేద్యం కాలేదు. వరి 29 శాతం, పప్పులు 27 శాతం సేద్యం కాలేదు. వేసిన పంటలు సైతం ఎండుతున్నాయి. విద్యుత్ కోతలు, కాల్వలకు నీరు అందకపోవడం, భూగర్భజలాలు తగ్గడం వలన లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మిచౌంగ్ తుపాన్ వలన ఖరీఫ్ పంటలు పోయాయి. పంట నష్ట పరిహారం రైతులందరికీ అందలేదు. ఇచ్చిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ చాలా తక్కువ. బీమా ఏమైందో తెలీదు. ఖరీఫ్‌లో ప్రకటించిన మండలాలే తక్కువ కాగా రుణాల రీషెడ్యూల్, తిరిగి పంటలేసుకోడానికి సబ్సిడీ రుణాలు, ఇతర సహాయ కార్యక్రమాలు అందించలేదు. గ్రామాల్లో, నగరాల్లో, పట్టణాల్లో తాగునీటి, కూలీలకు ఉపాధి సమస్యలు ఉన్నాయి. ఎన్నికల హడావిడిలో ఉన్న యంత్రాంగం పట్టించుకునే స్థితిలో లేదు.

# పెట్రో ధరలకు విరుగుడు

న్యూఢిల్లీ,: ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్టిక్ర్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండు మూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగగనుంది. ఇక చమురు ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించి కేవలం ఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్టిక్ర్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఎలక్టిక్ర్ వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్టిక్ర్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హెవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్టిక్ర్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గతంలోనే ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# పోరాటం ఫలించేనా

హైదరాబాద్, : ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో అరెస్టయి, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల విచారణలో ఉన్న భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుం ట్ల కవిత తరఫున ఆమె సోదరుడు, భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ న్యాయపోరాటం చేస్తున్నారు. కొద్దిరో జులుగా ఢిల్లీలోనే ఉంటున్న కేటీఆర్.. కవితను జైలు నుంచి విడుద ల చేయించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. లాయర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. సీనియర్ లాయర్ల సూచనలతో దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఫిర్యాదులు దాఖలు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల తీరును నిరసిస్తూ మొత్తం 537 పేజీల సమగ్ర వివరాలతో కవిత తరఫున న్యాయవాది మోహి త్ రావు సోమవారం సుప్రీంకోర్టులో ఓ ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ అంశంపై కేటీఆర్ సుదీర్ఘంగా చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు కవితను ఖఓం కింద అరెస్టు చేసిన నేపథ్యంలో.. బెయిల్ వచ్చే అవకాశాలు తక్కువని వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. సుఖేశ్ చంద్రశేఖర్ కూడా తీహార్ జైల్లోనే ఉన్నారు. ఆయన ఏకంగా తన న్యాయవాది ద్వారా కవితకు రెండు పేజీల లేఖ కూడా రాశారు. ఢిల్లీ మద్యం కుంభకో ణంలో కవిత ఎలాంటి పాత్ర పోషించారు చూచాయగా చెప్పారు. కవిత నోరు విప్పితే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా అరెస్టవుతారని.. ఆయనను కాపాడే ప్రయత్నం చేస్తే కవిత ఇంకా ఇబ్బందుల్లో పడుతుందని ఒకరకంగా హెచ్చరించే ప్రయత్నం చేశా రు. అంటే ఈ కేసు మరిన్ని సంక్లిష్టతలు ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో సుఖేష్ ఇదే స్థాయిలో లేఖలు విడుదల చేశారు. అప్పట్లో ఆ లేఖలను భారత రాష్ట్ర సమితి నాయకులు ఖండించారు. కవిత తప్పుపట్టారు. కానీ కొంత కాలం తర్వాత ప్రస్తుతం అతడు చెప్పినట్టు గానే జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓడిపోయింది.. ఆ పార్టీ ఓడిపోయిన కొద్ది రోజులకే కవిత అరెస్టయ్యారు. ఇక ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల విచారణలో ఉన్న కవితను మంగళవారం కేటీఆర్ ఒకరే కలిశారు. ఆదివారం కవితను ఆమె భర్త అనిల్, హరీష్ రావు తో కలిసి కేటీఆర్ పరామర్శించారు. సోమవారం కవితను కేటీఆర్, హరీష్ రావు పరామర్శించారు. మంగళవారం అనిల్, హరీష్ కాకుండా కేటీఆర్ ఒక్కరు మాత్రమే వెళ్లారు. కవిత భర్తకు ఇప్పటికే ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తాఖీదులు ఇచ్చారు. దీంతో ఆయన పది రోజుల వరకు హాజరు కాలేనని ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులకు లేఖ పంపారు. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయన కవితను కలవడానికి వీలుపడదు. నిబంధనల ప్రకారం సాయంత్రం ఐదు గంటలకు కవిత విచారణ సమయం ముగుస్తోంది. ఐదు గంటల 30 నిమిషాలకు వైద్యుల బృందం కవితకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నా రు. 6 గంటలకు ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ డాక్టర్ భానుప్రియ మీనా కార్యాలయం నుంచి వెళ్ళిపోతున్నారు. ఇక మంగళవారం కవితను కలిసే సమయంలో కోర్టు మార్పులు చేసింది. ఆరు నుంచి ఏడు గంటల వరకు కుటుంబ సభ్యులను కలవడానికి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. కవితను విచారిస్తున్న క్రమంలో.. ఏ అంశాల మీద ప్రశ్నలు అడుగుతున్నారో..ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు వీడియో రికార్డింగ్ చేస్తున్నారు.. అయితే గతంలో ఇదే కేసుకు సంబంధించి కవిత సెల్ ఫోన్ లను ఈడి అధికారులకు అప్పగించారు. ఇటీవల కవితను అరెస్ట్ చేసినప్పుడు ఆమె, ఆమె వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను ఈడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని అన్ లాక్ చేశారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. గతంలో కవిత చాలావరకు ఫోన్లను ధ్వంసం చేశారని.. వాటిని రిట్రైవ్ చేయడం ద్వారా సమాచారాన్ని తిరిగి సేకరించే ప్రయత్నాన్ని ఈడి అధికారులు చేస్తున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. మరి అప్పుడు కవిత ఇచ్చిన సెల్ ఫోన్ల ద్వారా ఈడి అధికారులు ఏమైనా సమాచారాన్ని సేకరించారా? లేదా కవిత వేరే ఫోన్లను ఇచ్చి ఈడి అధికారులను తికమకపెట్టారా? ప్రస్తుత ఫోన్లలో ఏమైనా సమాచారం దాగుందా? కొంతకాలం గడిస్తే తప్ప ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించడం కష్టం. మరోవైపు అనుబంధ పిటిషన్లు దాఖలు చేసేందుకు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

# అమరావతి ఉద్యమానికి తాత్కాలిక తెర



అమరావతి,రాజధాని అమరావతి ఉద్యమానికి ఎన్నికల సంఘం ఆదేశాలు, పోలీసుల సూచన మేరకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు సమన్వయ కమిటీ, అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి తెలిపింది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. అమరావతి ఉద్యమ కారులకు, మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, దళిత, మైనారిటీ జేఏసీ సభ్యులకు, లీగల్ అండ్ ఫైనాన్స్ కమిటీ సభ్యులకు, శిబిర నిర్వాహకులకు ఈ మేరకు ఐక్య కార్యాచరణ సమితి నుంచి ఆదేశాలు అందాయి. 1560 రోజులుగా ఎన్ని అవాంతరాలు, అణచివేతలు ఎదురైనా అప్రతిహతంగా అమరావతి ఉద్యమం కొనసాగింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఆదేశాలు, పోలీసు సూచనల మేరకు బహిరంగ సమిష్టి నిరసన కార్యక్రమాలకు తాత్కాలిక విరామం ప్రకటించారు. ఉద్యమకారులు కరోనా లాక్ డౌన్ సమయంలో నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. అదే విధంగా తమ ఇళ్ళ వద్దే నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా ఐక్యకార్యాచరణ సమితి విజ్ఞప్తి చేసింది. తదుపరి కార్యాచరణను పరిస్థితులకు అనుగుణంగా ప్రకటిస్తామని జేఏసీ తెలిపింది. రోజులు.. వారాలు.. నెలలు.. సంవత్సరాలు.. కాలగమనంలో కరిగిపోతున్నాయి.. కానీ అన్యాయంపై అమరావతి అన్నదాతలు సాగిస్తున్న సమరం నిరంతరంగా సాగుతూనే ఉంది. కరోనాలు, లాక్‌డౌన్‌లు, తుఫానులు, విలయాలు, పోలీసుల దౌర్జన్యాలు, దాష్టీకాలు, కేసులు, అరెస్టులు, వేధింపులు, లాఠీల దెబ్బలు, తూటాల వంటి మాటలు ఇలా ఎన్ని ఆటంకాలు వచ్చినా అవిశ్రాంతంగా అమరావతి అన్నదాతలు సాగిస్తున్న పోరాటం సాగుతూనే వచ్చింది. 1560 రోజులుగా రాజధాని రైతులు, కూలీలు అమరావతి కోసం పోరాడుతూనే ఉన్నారు. రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు, దళిత, బహుజన బిడ్డలు ఏకమై మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని సాగిస్తూనే ఉన్నారు. పోలీసుల నిర్బంధాలు, లాఠీల దెబ్బలు , గాయాలు.. ఏవీ వారి పోరాట పటిమను దెబ్బతీయలేకపోయాయి. అందుకే ఆ మహా మహోద్యమం మరిచిపోలేని విజయాలతో ముందుకు సాగింది. దేశ చరిత్రలో సుదీర్ఘ సమరశీల పోరాటంగా నిలిచిపోయింది. రాజధాని అమరావతిని కాదని వైసీపీ ప్రభుత్వం.. మూడు రాజధానుల ప్రకటన చేసింది మొదలు రాజధాని రైతులు ఉద్యమానికి దిగారు. అయితే, వీరి ఉద్యమాన్ని ఎప్పటికప్పుడు భగ్నం చేసేందుకు సర్కారు చేయని ప్రయత్నం లేదు. మహిళలు స్నానం చేసే సమయంలో డ్రోన్ కెమేరాలు తిప్పి.. దీనిని అడ్డుకున్న 40 మందిపై కేసులు పెట్టి 20 రోజులపాటు జైలుపాలు చేసింది ఇప్పటి వరకూ 2600 మందిపై 600కు పైగా కేసులు బనాయించారు. నాలుగేళ్లలో 250 మంది రైతులు గుండెలు పగిలి చనిపోయారు. బెదిరించడం, భయపెట్టడం, అవమానపరచడం, లేదంటే రెచ్చగొట్టడం, అదీ కాదంటే అక్రమంగా కేసులు పెట్టి జైళ్లలో కుక్కడం.. ఇలా రోజుకో రకంగా రైతులను వేధించారు. అయినా రైతులు వెనక్కి తగ్గలేదు. ఈక్రమంలో ఇసి ఆదేశాల మేరకు రాజధాని అమరావతి ఉద్యమానికి ఎన్నికల సంఘం ఆదేశాలు పోలీసుల సూచనమేరకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు సమన్వయ కమిటీ, అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి తెలిపింది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. అమరావతి ఉద్యమకారులకు, మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, దళిత, మైనారిటీ జేఏసీ సభ్యులకు, లీగల్ అండ్ఫ÷నాన్స్ కమిటీ సభ్యులకు, శిబిర నిర్వాహకులకు ఈ మేరకు ఐక్య కార్యాచరణ సమితి నుంచి ఆదేశాలు అందాయి. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి, పోలీసుల సూచన మేరకు రైతులు దీక్షలను నిలిపివేశారు. ఈ మేరకు అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి), సమన్వయ కమిటీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఎన్నికల నియమావళి, పోలీసుల సూచన మేరకు రాజధాని గ్రామాల్లోని రైతు దీక్షా శిబిరాల్లో ఆందోళనలకు తాత్కాలికంగా బ్రేక్ పడడంతో మంగళవారం నుంచి ఇళ్ళ వద్దనే నిరసనలు కొనసాగించాలని రైతు జెఎసి, సమన్వయ కమిటీ నిర్ణయించాయి. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాజధాని గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు, మహిళలు దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. వెంకటపాలెం, మందడం, వెలగపూడి, తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం రైతు దీక్షా శిబిరాలలో దీక్షలు సాగుతున్నాయి. సోమవారం తో దీక్షలు 1560వ రోజుకు చేరగా ఎన్నికల నేపథ్యంలో శిబిరాల్లో దీక్షలకు రైతు సంఘాలు తాత్కాలికంగా విరామం ప్రకటించాయి.

# ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. హైదరాబాద్ లోని ఆర్టీసీ కళాభవన్‌లో మంథని వైదిక సంస్థ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబుకు సత్కార్ సభ జరిగింది. ఈ సభలో మంత్రి శ్రీధర్‌బాబు కీలక ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. ఆధార్ నెంబర్ తరహాలో ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొ÷ల్ కార్డు ఇస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చికిత్స అందించేందుకు వీలుగా డిజిటల్ హెల్త్ ప్రొ÷ల్ కార్డును ప్రత్యేక నంబర్‌తో అనుసంధానం చేయనున్నారు. హెల్త్ ప్రొ÷ర్ కార్డుపై ఉన్న నెంబర్ గానీ.. పేరు గానీ ఎంటర్ చేయగానే.. ఆ వ్యక్తికి సంబంధించిన వైద్య సేవల వివరాలు తెలుస్తాయన్నారు. దీని వల్ల వారు ఏ వైద్యుడిని సంప్రదించినా.. వారివారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకునే వీలు ఉంటుందని.. మెరుగైన వైద్యసేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన సన్మాన సభలో రాజకీయాల్లో ఎలా ఎంట్రీ ఇచ్చారో కూడా మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. తన తండ్రి శ్రీపాదరావు మరణం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని చెప్పారు. తన తల్లి జయశ్రీ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 25ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవలు అందించినట్టు చెప్పారాయన. కాంగ్రెస్ పార్టీలో సేవలు అందించాలంటే చాలా సహనం ఉండాలని.. మంథని ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం... తనకు గన్‌మెన్‌ను తొలగించినా.. భయపెట్టే



ప్రయత్నం చేసినా.. వెనకడుగు వేయలేదన్నారు. హంగూ ఆర్భాటాలకు పోకుండా సాధారణ వ్యక్తిగానే పనిచేశానని చెప్పారు. హౌస్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ కిషన్‌రావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, నడిపెల్లి వేణుగోపాల్‌రావు, ఇనుగాల భీమారావులు మంత్రికి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. సభలో మాజీ ఎంపీ సుగుణకుమారి, వైదిక సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణతోపాటు పలువురు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేల కోసం ఎమ్మెల్యేల క్వార్టర్లలోని డిస్పెన్సరీలతోపాటు అన్ని ఆసుపత్రుల్లో చికిత్సకు అనుగుణంగా మెడిసన్ సరఫరా చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యేలు రాజేశంగౌడ్, ఆంజనేయులు, సత్యనారాయణ గౌడ్‌తోపాటు పలువురు ఆదివారం మంత్రిని ఆయన ఆఫీసులో కలిశారు. మెడిసిన్ సరఫరాలో కొరతను తీర్చాలని కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు వెంటనే స్పందించారు. మెడిసిల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# టిక్కెట్ రాకుండా జగన్ కుట్రలు..



అమరావతి, తాను మరోసారి నరసాపురం నుంచి బరిలోకి దిగాలని భావించిన ఎంపీ రఘురామకృష్ణరాజుకు నిరాశే ఎదురైంది. ఏపీ ఎన్నికల్లో కూటమిలో భాగంగా ఈ సీటును బీజేపీకి కేటాయించగా.. భూపతిరాజు శ్రీనివాసవర్మకు అవకాశం దక్కింది. తనకు దక్కకపోవడంపై ఎంపీ రఘురామ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను తాత్కాలికంగా ఓడిపోయానని, అందుకు కారణం ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఆరోపించారు. తనకు నరసాపురం టికెట్ రాకుండా అడ్డుకుంటాడని అనుమానం ఉండేదని, ఇప్పుడు అది నిజమైందన్నారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేసిన రఘురామ పలు విషయాలు షేర్ చేసుకున్నారు. గత నాలుగేళ్లుగా తనను జగన్ టార్గెట్ చేశారని, ఇప్పుడు తనకు నరసాపురం ఎంపీ టికెట్ రాకుండా చేశారని ఏపీ సీఎంపై ఆరోపణలు చేశారు. రాబోయే రోజుల్లో ప్రజాబలంతో, ప్రజల అండతో ప్రతి ఒక్కరితో అడుగులు వేయించి రాజకీయంగా జగన్‌ను అథఃపాతాళానికి తొక్కేయకపోతే తన పేరు రఘురామకృష్ణరాజే కాదన్నారు. ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు సహకారంతో ఏపీ సీఎం జగన్ తనకు నరసాపురం టికెట్ రాకుండా అడ్డుకున్నారని రఘురామ పదే పదే వ్యాఖ్యానించారు. తాను నరసాపురం నుంచి పోటీ చేస్తానా, వేరే స్థానం చేస్తానా అనేది త్వరలో వెల్లడిస్తామన్నారు. తనను కొన్ని పార్టీలకు దూరం చేయాలని చేసే కుట్రలో జగన్ తాత్కాలికంగా సక్సెస్ అయ్యారని రఘురామ పేర్కొన్నారు. తనకు నరసాపురం టికెట్ రాలేదని ముందే తెలియడంతో అభ్యర్థుల ప్రకటనకు కొంత సమయానికి ముందే సిట్టింగ్ ఎంపీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో జగన్ అనుకున్నది జరగదని, కూటమి విజయం తథ్యమని ఎంపీ రఘురామ అన్నారు. ఆ పార్టీకి ఓటు వేస్తే వైసీపీకి ఓటు వేసినట్లేనని జనాలకు భ్రమ కల్పిస్తున్నారని అభిప్రాయపడ్డారు. గత నాలుగేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, అరాచకాలపై పోరాటం చేశాను.. నిజంగా పదవే అనుభవించాలని భావిస్తే... నాలుగేళ్లపాటు ఢిల్లీలో ఉంటూ అజ్ఞాతవాసం గడపాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని పార్టీలకు తనను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నా, ఆ కుట్రల్ని త్వరలోనే తిప్పి కొడతామన్నారు. తనకు టికెట్ రాకపోవడంపై ఎంతోమంది ఆందోళన చెంది, తనకు ఫోన్లు చేశారని, మెస్సేజ్ చేశారని చెప్పారు. తాత్కాలికంగా తాను వెనకడుకు వేస్తున్నానని, మళ్లీ అంతే వేగంగా ముందడుగులు వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. నరసాపురంలో బీజేపీ నేత, కూటమి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ విజయం సాధించాలని ఆకాంక్షించారు. సీఎం జగన్ గతంలో నన్ను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో హత్యాయత్నం చేసి విఫలమయ్యారు. పోలీస్ ఉన్నతాధికారుల సహాయంతో నన్ను లేపేయాలని చూశారు. నియోజకవర్గానికి, సొంత ప్రాంతానికి రాకుండా అడ్డుకున్నారు. జగన్ నన్ను డిస్క్వాలి÷ చేయాలని చూశారు. అప్పుడు జగన్‌కు విజయం దక్కలేదు. కానీ నేడు నాకు నరసాపురం టికెట్ రాకుండా చూడటంలో జగన్ తాత్కాలికంగా విజయం సాధించారు. నా ఓటమిని అంగీకరిస్తున్నాను. చంద్రబాబుతో కలిసి పనిచేయాలన్న ఉద్దేశంతో వేరే ఆలోచనలు చేయడం లేదు. సొంత బాబాయి వివేకా హత్య, అమరావతి రైతులకు చేసిన అన్యాయం లాంటి ఎన్నో చూసిన తరువాతే జగన్‌పై తిరుగుబాటు చేశాను.

# కాంగ్రెస్ డబుల్ గేమ్?.. ఓవైపు ఎంఐఎంతో దోస్తీ.. మరోవైపు ఎంబీటీతో చర్చలు



హైదరాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతున్నదా? ఓవైపు ఎంఐఎంతో స్నేహం నటిస్తూ, మరో పార్టీతో లోపాయకారీ ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నదా.? తాజా పరిణామాలను గమనిస్తే ఔననే అనిపిస్తున్నది. హైదరాబాద్ పార్లమెంట్‌లో ఎంఐఎంను దెబ్బకొట్టేలా కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇందుకోసం ఎంఐఎంకు పోటీగా భావిస్తున్న మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) పార్టీతో కాంగ్రెస్ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఎంబీటీకి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మూడు చోట్ల బలమైన ఓటు బ్యాంకు ఉన్నది. ఎంఐఎం తమతో స్నేహం కోసం ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ మంత్రులు పలుమార్లు ప్రకటించారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆ పార్టీతో ఫ్రెండ్లీ పోటీ ఉంటుందని చెప్పారు. అయితే, స్నేహపూర్వక పోటీ కాకుండా ఎంఐఎంను ఓడించేందుకు అన్ని రకాల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర కాంగ్రెస్ భావిస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఎంబీటీతో మొదటి దఫా చర్చలు పూర్తయ్యాయని, ఎంబీటీ మద్దతుతో మైనార్టీ ఓటుబ్యాంకును చీల్చవచ్చని, తద్వారా ఎంఐఎంను ఇరుకున పెట్టొచ్చని, అవసరమైతే ఓడించొచ్చని కాంగ్రెస్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారని, ఎంఐఎంను సొంత గడ్డమీద ఓడిస్తే ఓటుబ్యాంకు మరింత బలపడుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. అంతేకాకుండా.. ఎంఐఎంను నమ్మలేమని, ఎప్పుడూ తన స్వార్థం కోసం అధికారంలో ఉన్న పార్టీతో స్నేహం నటిస్తుందే తప్ప ఎవరితోనూ నిజమైన భాగస్వామిగా ఉండదని కాంగ్రెస్ పెద్దలు విశ్వసిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే గత అసెంబ్లీ సమావేశాల్లో ఓ సందర్భంలో 'మీరు ముస్లింలందరికీ ప్రతినిధి కాదు' అని అక్బరుద్దీన్ ఓవైసీని ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కొనసాగింపుగానే ఎంబీటీతో చేతులు కలిపేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంబీటీని 1993లో మహ్మద్ అమానుల్లాఖాన్ స్థాపించారు. ఎంఐఎం అధ్యక్షుడు సలావుద్దీన్ ఓవైసీతో విభేదించి సొంతంగా పార్టీ నెలకొల్పారు. అప్పటి నుంచి పాతబస్తీలో ఎంఐఎంకు ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతున్నది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మంచి ఓటు బ్యాంకు ఉండగా, ముఖ్యంగా యాకత్‌పురాలో బలంగా ఉన్నది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 878 ఓట్ల తేడాతో అక్కడ సీటును కోల్పోయింది. దీంతోపాటు చాంద్రాయణగుట్ట, మలక్‌పేటలోనూ పార్టీకి మంచి పట్టున్నది.

# వామపక్షాలకు జీవన్మరణం



న్యూఢిల్లీ, ఒకప్పుడు దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న లెఫ్ట్ పార్టీల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. దేశ రాజకీయాల్లో ఒకనాడు చక్రం తిప్పిన పార్టీలు నేడు మనుగడ కోసం పడరాని పాట్లు పడుతున్నాయి. సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ లాంటి లెఫ్ట్ పార్టీలు క్రమంగా ప్రాబల్యాన్ని కోల్పోతున్నాయి. చివరికి సీపీఎం కూడా జాతీయ పార్టీ హోదాను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వామపక్షాలకు ఐదుగురు ఎంపీలు మాత్రమే ఉన్నారు. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికలు లెఫ్ట్ పార్టీలకు అగ్నిపరీక్షగా మారాయి. ఇందులో సత్తా చాటకపోతే వాటి మనుగడే ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేరళలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) అధికారంలో ఉన్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రతిపక్షంగా ఉన్నది. కాంగ్రెస్, వామపక్షాలు ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ కేరళలో మాత్రం విడిగా పోటీచేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 20 లోక్‌సభ స్థానాలు ఉండగా, గత లోక్‌సభ ఎన్నికల్లో యూడీఎఫ్ 19 స్థానాలు కైవసం చేసుకోగా, ఎల్డీఎఫ్ ఒక్కసీటుకే పరిమితమైంది. ఒక్క సీటునూ గెలవని బీజేపీ కూడా ఈసారి సత్తా చాటాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఇక సుదీర్ఘ కాలం కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండి.. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ కోటగా మారిన పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పార్టీ టీఎంసీ ఒంటరిగానే పోరాడుతున్నది. ఇక్కడ సీపీఐ 16 మంది అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్‌తో పొత్తుకోసం ఎదురుచూస్తున్నది. 2019 ఎన్నికల్లో సీపీఐ కేవలం ఒక్క శాతం ఓట్లను కూడా పొందలేకపోయింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఓటుబ్యాంకును మూడు శాతానికి పెంచుకుని 16 ఎమ్మెల్యే స్థానాలను వామపక్షాలు గెలుచుకున్నాయి.

**15 ఏండ్ల క్రితమే పతనం ప్రారంభం**

ప్రస్తుత లోక్‌సభలో సీపీఐ నుంచి ముగ్గురు, సీపీఎం నుంచి ఇద్దరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అరవై ఏండ్ల చరిత్రలో ఇంత తక్కువ సంఖ్యలో వామపక్షాల బలం ఎన్నడూ లేదు. 1990 నుంచి 2009 వరకు జాతీయ రాజకీయాల్లో లెఫ్ట్ పార్టీలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ హయాంలో ప్రధాని పదవి కూడా దక్కే అవకాశమొచ్చింది. 2004లో ఒక్క సీపీఎం నుంచే 43 మంది ఎంపీలు, 10 మంది సీపీఐ ఎంపీలు, ఏఐఎఫ్‌బీ, ఆర్ఎస్‌పీ తరఫున ముగ్గురేసి ఎంపీలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత నుంచే వామపక్షాల ప్రభావం క్షీణించటం మొదలైంది. 2009 నుంచి 2019 మధ్య లెఫ్ట్ పార్టీల పతనం శరవేగంగా సాగింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్‌లో టీఎంసీ చేతిలో, 2018లో త్రిపుర అసెంబ్లీలో బీజేపీ చేతిలో లెఫ్ట్ పార్టీలు ఓటమి చవిచూశాయి.

**ప్రాంతీయపార్టీల పొత్తుతో..**

కేరళ, తమిళనాడులో సిట్టింగ్ ఎంపీలున్న సీపీఎం, సీపీఐలు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నాయి. తమిళనాడులో అధికార డీఎంకేతో జతకట్టిన వామపక్షాలు కేవలం రెండేసి సీట్లలో మాత్రమే పోటీ చేస్తున్నాయి. బీహార్‌లో భారీ ఆశలే పెట్టుకున్నాయి. జార?ండ్‌లో జేఎంఎంతో కలిసి పోటీ చేయాలనుకుంటున్నది. చాలా రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవటానికే తంటాలు పడుతున్నాయి. ఇక సీట్లు దక్కించుకోవడం ఆ పార్టీలకు పెద్ద సవాలే. బెంగాల్‌లో టీఎంసీ తర్వాత ప్రధాన పార్టీగా బీజేపీ అవతరించటంతో వామపక్షాల ఉనికి అక్కడ నామమాత్రంగా మారింది.

# టెట్ ఫీజులో ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు అన్యాయం

హైదరాబాద్,ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫీజులను భారీగా పెంచిన సర్కారు.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే రాయితీని విస్మరించింది. ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులపై మోయలేని భారాన్ని మోపింది. రాజ్యాంగసూత్రాలకు విరుద్ధంగా, రిజర్వుడ్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించకుండా జనరల్ క్యాటగిరీ విద్యార్థులతో సమానంగా ఒకే తరహా ఫీజులను అమలుచేస్తున్నది. అదే జాతీయంగా నిర్వహిస్తున్న సీటెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు సీబీఎస్ఈ ఫీజు రాయితీని అమలు చేస్తున్నది. మన రాష్ట్రంలో ఎప్‌సెట్, ఐసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లోనూ ఫీజుల రాయితీని అమలు చేస్తున్నారు. కానీ టెట్‌లో మాత్రం రాయితీ ఇవ్వడం లేదు. దీనిపై ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేశారు. ఆదివారం గద్వాల జిల్లాలో టెట్ అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. టెట్ ఫీజును తగ్గించాలని, పాత ఫీజుల విధానాన్నే కొనసాగించాలని వారంతా ప్రతినబూనారు.

**150 నుంచి 300 శాతం మేర పెంపు**

టెట్ ఫీజులను ఇటీవలే ప్రభుత్వం భారీగా పెంచింది. నిరుడు ఒక పేపర్ రాసినా, రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు తీసుకోగా, ఈ ఏడాది ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్లకు రూ.2,000 ఫీజుగా ఖరారు చేశారు. ఈ ఫీజులు సీబీఎస్ఈ నిర్వహించే సీటెట్‌తో పోల్చితే 300 శాతం అధికంగా ఉండటం గమనార్హం. సీటెట్‌కు జనరల్ క్యాటగిరీ అభ్యర్థుల నుంచి ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్లకు 1,200 మాత్రమే తీసుకుంటున్నారు.

ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్‌లో జనరల్ విద్యార్థులకు ఒక పేపర్‌కు రూ.900, రెండు పేపర్లకు రూ.1,800 వసూలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థుల నుంచి ఒక పేపర్‌కు రూ.500, రెండు పేపర్లకు రూ.1,000 మాత్రమే ఫీజుగా తీసుకుంటున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఐసెట్‌లో జనరల్ విద్యార్థులకు రూ.750, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు రూ.550 చొప్పున ఫీజులు తీసుకుంటున్నారు.

**ఫీజుల్లేకుండా దరఖాస్తులు స్వీకరించాలి**

నిరుద్యోగుల నుంచి రూపాయి ఫీజు తీసుకోకుండా దరఖాస్తులు స్వీకరిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజుల పేరుతో నిరుద్యోగుల నడ్డి విరుస్తోంది. టెట్ ఫీజుల పెంపు మరీ దారుణం. ఎన్నికల హామీని నిలబెట్టుకొని తక్షణమే రూపాయి ఫీజు లేకుండా దరఖాస్తులు



స్వీకరించాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.– జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్వీ

# బిజెపిలో చేరిన గాలి జనార్ధన్ రెడ్డి

బెంగళూరు, మూడోసారి అధికారం దక్కించుకోవాలని బిజెపి..లోక్ సభ ఎన్నికల్లో పక్కా వ్యూహంతో అడుగులేస్తోంది. ఈ క్రమంలో పలువురు ముఖ్య నేతలను పార్టీలో చేర్చుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఇతర పార్టీల నాయకులు బిజెపిలోకి వెళ్లి కండువా కప్పుకున్నారు. తాజాగా కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి సొంత గూటికి వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం మల్లేశ్వరంలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర నేతల సమక్షంలో గాలి జనార్ధన్ రెడ్డి కమలం పార్టీలో చేరబోతున్నానని వెల్లడించారు. తన పార్టీ.. కల్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ)ని బిజెపిలో విలీనం చేయనున్నట్లు ఆయన తెలిపారు. తనతోపాటు పార్టీ నేతలంతా బిజెపిలో చేరుతారని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో హోంమంత్రి అమిత్ షాని కలిశారు. ఈ సందర్భంగా బిజెపిలో తన పార్టీ విలీన అంశంపై అమిత్ షాతో ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. బిజెపికి బయట నుంచి మద్దతు ప్రకటించడం కంటే పార్టీని విలీనం చేయడానికి నేతలంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారని గాలి జనార్దన్ రెడ్డి తెలిపారు. బిజెపి అనేది మా రక్తంలోనే ఉందని.. మళ్లీ పార్టీలో చేరి సాధరణ కార్యకర్తగా పని చేస్తానన్నారు. మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాని అయ్యేందుకు తాము కృషి చేస్తామని ఆయన చెప్పారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com